

పంచారామాల్లో విశేష పూజలు





భీమవరం సోమేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు.. పాలకొల్లులో క్షీరా రామలింగేశ్వర స్వామికి అలంకరణ

భీమవరం టౌన్/పాలకొల్లు అర్బన్, నవంబరు 25 : కార్తీక సోమవారం నేపథ్యంలో పంచారామ క్షేత్రాలైన భీమేశ్వరం సోమేశ్వరస్వామి, పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భీమవరానికి పలుప్రాంతాల నుంచి 150 బస్సులల్లో భక్తులు తరలి వచ్చారు. మొత్తం 40 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారని అంచనా. సోమేశ్వరుడి 10లక్షల 92 వేల 433 రూపాయల ఆదాయం వచ్చింది. పాలకొల్లులో 45వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్టు ఆలయ వర్గాల సమాచారం. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ కె.సుబ్బారావు సతీ సమేతంగా విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. పట్టణంలో పంచారామ క్షేత్రాల పేరుతో వచ్చిన బస్సులు, ప్రైవేటు వాహనాలతో రద్దీగా మారింది. కార్తీక దీపాలు వెలిగించే భక్తులతోను, దానాలు ఇచ్చుకునేవారితో ఆలయంలో మండపాలు నిండిపోయాయి.

లేసు పరిశ్రమకు మరింత చేయూత: కలెక్టర్



కేంద్ర మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కలెక్టర్ నాగరాణి

నరసాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): లేసు మహిళలు అల్లికల్లో చూపిన నైపుణ్యం వల్లే అంతర్జాతీయ భౌగోళిక జియోగ్రాఫికల్(ఐజీ) సర్టిఫికెట్ అందుకోగలిగానని జిల్లా కలెక్టర్ నాగ రాణి అన్నారు. సోమవారం ఢిల్లీలోని కేంద్ర జౌళిశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వర్క్‌షాపులో కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్ చేతుల మీదుగా కలెక్టర్ ఐజీ సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేతి ఉత్పత్తులకు మంచి గుర్తింపు ఉంటుందన్నదానికి జాతీయ స్థాయిలో లభించిన ఐజీ సర్టిఫికెట్‌నే నిదర్శనమన్నారు. లేసు పరిశ్రమకు మరింత చేయూతనిచ్చేందుకు మార్కెటింగ్ సదుపాయంతో పాటు డిజైన్లలో కూడా శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఈ వర్క్‌షాపులో నరసాపురం లేసు ట్రేడ్ సెంటర్ కన్వీనర్ కలవకొలను తులసీ పాల్గొన్నారు.



కొమ్ముగూడెంలో కొండలా చెత్త

ఏదీ చె(చి)త్త శుద్ధి!

- గ్రామాల్లో చెత్త సమస్య
- అలంకారప్రాయంగా సంపద తయారీ కేంద్రాలు
- పారిశుధ్య కార్మికుల లోటు

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 17లక్షల మంది జనాభా ఉండగా వారి ఇళ్ళ నుంచి రోజూ వేల టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. ఆ చెత్తను శుద్ధి చేసే కార్యక్రమం నీరుగారి పోతోంది. మేజర్ పంచాయతీలో ఎంతో కొంత నిధులు ఉన్నా వాటిని ఉద్యోగుల జీతాలు ఇవ్వడానికి, కరెంటు బిల్లులు చెల్లించడానికే సరిపోతున్నది. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైయిన్‌లు, ప్రభుత్వ కార్యాలయాలు ఎన్ని నిర్మించినా గ్రామాలను చెత్త సమస్య పట్టిపీడిస్తున్నది. గతంలో టీడీపీ హయాంలో చెత్తను శుద్ధిచేసి దాని నుంచి సందప సృష్టించాలని సంపద తయారీ కేంద్రాలను నిర్మించింది. ఈ కేంద్రాలను ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిరుపయోగంగా మార్చింది. దీనితో సంపద తయారీ కేంద్రాలు అసాంఘీక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. ఫలితంగా గ్రామాల్లో చెత్తగుట్టలు పేరుకుపోయి ప్రజా రోగ్యాలపై ప్రభావం చూపించే పరిస్థితి ఏర్పడింది. గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు అరకొరగా ఉండటంతో చెత్తను సేకరించడమే గగనమైపోయింది. దీంతో వచ్చిన చెత్తను ఇష్టానుసారం పారబోస్తు న్నారు. ఎవరైనా అధికారి లేక ప్రజా ప్రతినిధి గ్రామ పర్యటనకు వస్తుంటే వాటి ని ఎత్తి మళ్ళీ వేరే ప్రాంతాలకు తరలించ డం పరిపాటిగా మారింది. అదే సంపద తయారీ కేంద్రాలను యాక్టివ్ చేయించి పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచడంతో పాటు చెత్తను వేరుచేసే పనిలో ఉపాధి కూలీలను ఉపయోగించుకునే వెసులు బాటు కల్పిస్తే ఈ చెత్త సమస్య తగ్గించ వచ్చని పర్యావరణ ప్రేమికులు భావిస్తు న్నారు.

స్థలం తప్పనిసరి

సంపద తయారీ కేంద్రాల సమీపంలో ఓ స్థలం కేటాయించడం ద్వారా ఆ స్థలంలో చెత్తను వేరుచేసి పొడిచెత్తను టన్నుల కొద్ది విక్రయించడం, తడిచెత్తను ఎరువుగా మార్చే ప్రక్రియ చేయడం ద్వారా సంపద సృష్టించే విధంగా గ్రామాలు అభివృద్ధి చెందితే చెత్త సమస్య కొంత వరకు పరిష్కారం అవుతుంది.

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని ఓ పంచాయతీలో 4200 మంది జనాభా ఉన్నారు. ఆ గ్రామంలో అధికారిక అంచనా ప్రకారం ఐదుగురు గ్రీన్ అంబాసిడర్స్ ఉండాలి. వాస్తవంగా అక్కడ ఒకే ఒక గ్రీన్ అంబాసిడర్ ఉన్నాడు. అతనే గ్రామంలోని కుటుంబాల నుంచి చెత్త సేకరించే పని చేపట్టాలి. తెచ్చిన చెత్తను ఏక్కడో ఒక చోట వేయడం తప్ప ఆ ఒక వ్యక్తి మరేమి చేయలేని పరిస్థితి. దీనికి తోడు బయట నుంచి ప్రత్యేకంగా పనిచేయిద్దామంటే ఆ పంచాయతీలో నిధులు లేని దుస్థితి. దీంతో గతంలో ఏర్పాటు చేసిన సంపద తయారీ కేంద్రం నిరుపయోగంగా మారింది. ఇది జిల్లాలోని ఓ గ్రామానిదే కాదు. అనేక గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొన్నది.

పారిశుధ్య కార్మికులేరీ..

17లక్షల 79వేల జనాభా ఉన్న జిల్లాలో వెయ్యి మందికి ఒక పారిశుధ్య కార్మికుడు ఉండాలి. అంటే జిల్లాలో 1769 మంది పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహించాలి. కానీ వాస్తవంగా అందులో సగం మంది కూడా కార్మికులు లేకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రభావం చూపుతున్నది. పంచాయతీల్లో అధిక శాతం పారిశుధ్య నిర్వహణకు ఖర్చుచేసే విధంగా నిధులు కేటాయిస్తే పారిశుధ్యం గాడిన పడే అవకాశం ఉంటుంది.

జనాభా ప్రాతిపదికన ఉండాలి
అరుణశ్రీ, డీపీవో



గ్రామాల్లో జనాభా ప్రాతిపదికన పారిశుధ్య కార్మికులు (గ్రీన్ అంబాసిడర్స్)ను నియమించాల్సి ఉంది. పంచాయతీల్లో నిధులు లేక అవసరానికంటే తక్కువగా పారిశుధ్య కార్మికులు ఉన్నారు. ఈ సమస్య పరిష్కారం కావాలంటే గ్రామాల్లో జీతాలు చెల్లించే నిధులు వస్తే మెరుగుపడుతుంది.

మహిళల చేతికి డ్రోన్‌లు



- నమో డ్రోన్ దీదీ పథకంలో శిక్షణ
- పొలాల్లో పురుగు మందుల పిచికారీకి వినియోగం
- మండలానికి మూడు డ్వాక్రా గ్రూప్‌ల ఎంపిక
- సబ్సిడీపై డ్రోన్లు అందజేత
- చదువుకున్న మహిళలకు ప్రాధాన్యం

నరసాపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులకు డ్వాక్రా మహిళలు అండగా నిలవనున్నారు. వ్యవసాయ పనుల్లో వారికి సాయంగా నిలిచి డ్రోన్ల సాయంతో పురుగు మందులు, ద్రవ ఎరువులు పిచికారి చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన నమో డ్రోన్ దీదీ పథకంలో భాగంగా డ్వాక్రా మహిళలను వ్యవసాయ రంగంలో కూడా తీసుకొచ్చి వారికి జీవనోపాధి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దానిలో భాగంగా విద్యావంతులైన మహిళలకు సబ్సిడీపై డ్రోన్లు అందించనున్నారు. వీటి నిర్వహణపై శిక్షణ ఇచ్చి వ్యవసాయ పనులు చేయిస్తారు. తొలి విడతగా జిల్లాలో ప్రతి మండలంలోని మూడు డ్వాక్రా గ్రూప్‌లలోని విద్యావంతుల్ని ఎంపిక చేస్తారు. వ్యవసాయ దిగుబడి వ్యయాన్ని తగ్గించడం, కూలీల సమస్యల అధికమించడం, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మహిళలకు మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలన్న లక్ష్యంతో మహిళలకు ఈ బాధ్యతల్ని అప్పగిస్తున్నారు. దానికి అనుగుణంగా డీఆర్‌డీఏ విద్యావంతులైన డ్వాక్రా మహిళల్ని ఎంపిక చేసే పనిలో పడింది. త్వరలో వీరిందరికీ వ్యవసాయశాఖ శిక్షణ ఇవ్వనుంది.

రూ.8 లక్షల సబ్సిడీ

ఇక మహిళలకు అందించే డ్రోన్ల ఖరీదు రూ.10లక్షలు విలువ చేస్తుంది. వీటిలో మహిళలు కేవలం 20శాతం చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన 80శాతం ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తుంది. అంటే రూ. 10లక్షల్లో మహిళలు రూ 2లక్షలు చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన రూ.8లక్షలు సబ్సిడీనే. దాన్ని తిరిగి చెల్లించనవసరం లేదు. ఇక వీటిని ఎలా ఆపరేట్ చేయాలన్న దానిపై కూడా మహిళలకు 15 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. అవసరమైతే వారి కుటుంబంలో విద్యావంతులైన మరొకర్ని కూడా సహాయకులుగా తీసుకునే వెసులుబాటు కల్పించనున్నారు. వీరికి కూడా డ్రోన్లు ఏవిధంగా అమర్చాలి, వచ్చే చిన్న చిన్న సాంకేతి సమస్యలపై అవగాహన కల్పిస్తారు. ఇక రసాయనాలు, పురుగు మందుల్ని ఏ విధంగా కలిసి డ్రోన్లకు అమర్చాలి, వాటిని రిమోట్ కంట్రోల్ ద్వారా ఏ విధంగా ఆపరేట్‌పై తదితర విషయాలపై అవగాహన కల్పిస్తారు. జిల్లాలో 20 మండలాలు ఉండగా స్వయం సహాయక సంఘాలు 28754, డ్వాక్రా సభ్యులు 2,88140 మంది ఉన్నారు.

డ్వాక్రా మహిళలకు కొత్త జీవనోపాధి

జిల్లా వ్యవసాయ రంగానికి పెట్టింది పేరు. దాదాపు 4.50లక్షల ఎకరాల్లో వరి సాగు అవుతున్నది. అయితే ఉత్పత్తి వ్యయం పెరగడంతో రైతుకు గిట్టుబాటు ధర లభించడం లేదు. ఎక్కువ ఖర్చు కూలీలు, ఎరువులు, మందులకే సరిపో తుంది. వీటితో పాటు కొన్ని సమయాల్లో పొలా ల్లో మందులు పిచికారి చేసేందుకు కూలీలు కూడా చిక్కడం లేదు. కొన్ని సమయాల్లో రైతులే పిచికారి చేసుకుని అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇటీవల వ్యవసాయ రంగంలో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించేందుకు డ్రోన్లను తయారు చేశారు. కేంద్ర ప్రభుత్వం వీటిని రైతులకు అందించి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలని భావిం చింది. దానికి అనుగుణంగా నమో డ్రోన్ దీదీ పథకాన్ని ప్రవేశ పెట్టింది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలకు రాష్ట్ర ప్రభుత్వా లకు అందించింది. కూటమి ప్రభుత్వం బయట వ్యక్తులకు కాకుండా మహిళల్ని వ్యవసాయరంగానికి తీసు కొచ్చి వారికి జీవనోపాధికి అవకాశాలు పెంచాలని భావిం చింది. ఈ బాధ్యతల్ని డ్వాక్రా మహి ళలకు అప్పగిస్తే సమర్థంవతంగా నిర్వహిస్తారని యోచించింది. జిల్లాలో 80శాతం డ్వాక్రా మహి ళలు వ్యవసాయరంగానికి సంబంధించిన కుటుంబాలకు చెందిన వారే. వీరికి ఈ బాధ్యతల్ని ఇస్తే సమర్థవంతగా చేపట్టి మంచి ఫలితాలు తీసుకొస్తారన్నది ప్రభుత్వ ఆలోచన. ఇక ఎంపిక చేసే బాధ్యతను డీఆర్‌డీఏకు అప్పగించారు. ప్రతి మండలం నుంచి మూడు గ్రూప్‌లను ఎంపిక చేస్తారు. వీరిలో విద్యావంతుల్ని గుర్తించి వారికి డ్రోన్ల నిర్వహణపై శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణ వ్యవసాయశాఖ చేపడుతుంది. సాగు సమయంలో శిక్షణ పొందిన వారంతా వ్యవసాయశాఖ అధికారులతో కలిసి ఆ మండల పరిధిలో అవసరమైన రైతుల భూముల్లో డ్రోన్ల సాయంతో పిచికారి పనులు చేపడతారు. ఇందుకు నామమాత్రపు ఛార్జీలు తీసుకుంటారు. రైతులు పిచికారిచేయాల్సి మందుల్ని ఇస్తేసరిపోతుంది.

ఎంపిక చేస్తున్నాం
కుసుమ కుమారి, డీఆర్‌డీఏ డీపీఎం

నమో డ్రోన్ దీదీ పథకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. దానికి అనుగుణంగా ప్రతి మండలం నుంచి మూడు డ్వాక్రా గ్రూప్‌ల్ని ఎంపిక చేస్తున్నాం. ప్రస్తుతం ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. ఈనెలాఖరు నాటికి పూర్తి చేస్తాం. శిక్షణ బాధ్యత, డ్రోన్ల అప్పగింత వంటి పనుల్ని వ్యవసాయశాఖ చూసుకుంటుంది

అదే పంథా!

- వైసీపీ వాసనలు వదలుకోని అధికారులు
- విమర్శల పాలవుతున్న ప్రభుత్వ విద్యా సంస్థ
- ఉద్యోగ నియామకాల్లోనూ అదే తీరు



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

అది రాష్ట్ర స్థాయిలోనే పేరుపొందిన ప్రభుత్వ విద్యా సంస్థ. పరిశోధనా రంగ ంలో ఎంతో ప్రసిద్ధి చెందింది. జాతీయ స్థాయి దృష్టిని ఆకర్షించింది. జిల్లాలో రైతాంగానికి ఎన్నో రకాలుగా సేవలు అందించింది. ఇప్పుడు సదరు విద్యా సంస్థ ప్రతిష్ట మసకబారుతోంది. అధికారులు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా ఉంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా సంస్థ ఉన్నతాధికారి పదవిలో ఇన్‌చార్జిను నియమించారు. కొద్ది రోజు ల్లోనే ఆయన సంస్కరణలు చేపట్టారు, ఎప్పటి నుంచో పరిశోధనా స్థానాల్లో, విద్యా సంస్థల్లో వేళ్లూనుకుపోయిన అధికార యంత్రాంగాన్ని పక్కన పెట్టారు. కొత్తవారికి పగ్గాలు అప్పగించారు. రెగ్యులర్ నియామకాలు చేపట్టారు. దాంతో ఉన్నత విద్యా సంస్థకు పూర్వవైభవం వస్తుందని అంతా ఆశించారు. కానీ క్రమేపీ మళ్లీ విమర్శలు జోరందుకుంటున్నాయి. ఉద్యోగాలు అమ్మకానికి పెడుతున్నారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల 10 మంది సిబ్బందిని నియమించారు. ఒక్కో ఉద్యోగి నుంచి రూ. 15 లక్షల వంతున వసూలు చేశారంటూ గప్పుమంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అయితే ఒకేరోజులో ఇంటర్వ్యూలు నిర్వహించి మరుసటి రోజే పోస్టింగ్‌లు ఇచ్చేశారు. అప్పట్లో రెగ్యులర్ ఉన్నతాధికారి కనుసన్నల్లోనే నియామకాలు సాగాయి. న్యాయపరమైన చిక్కులు ఎదురవకుండా ఉండాలన్న ఉద్దేశంతో ఒక్క రోజు వ్యవధిలో అధ్యాపక ఉద్యోగాలు భర్తీ చేసినట్టు అధికారులు సర్దిచెప్పుకున్నారు. అప్పటి అధికారి ఒక నియంతలా పాలనసాగించారు. రెండో సారి వైసీపీ ప్రభుత్వం ఆయనకే పగ్గాలు అప్పగించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవమానకర రీతిలో పదవి నుంచి వైదొలగారు. ఆయన వెళ్లిపోయిన తర్వాత కూడా సదరు విద్యా సంస్థలో మార్పులు పెద్దగా లేకుండా పోయాయి. గతంలో రాజకీయాలకు అతీతంగా గుర్తింపు పొందిన విద్యా సంస్థ ఇప్పుడు పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వానికి అధికారులంతా వంత పాడారు. గత తెలుగుదేశం కూటమి ప్రభుత్వంలో అప్పటి అధికారులు అభివృద్ధి చేసి మన్ననలు అందుకున్నారు. గౌరవప్రదంగా పదవీ విరమణ చేశారు. అప్పటిదాకా సదరు విద్యా సంస్థ రాజకీయాలకు అతీతంగా వ్యవహరించింది. బోధన, అధ్యయన, పరిశోధనా రంగాలకే పెద్దపీట వేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పరిశోధనా కేంద్రాలను విస్తరించుకుంది. గత ఐదేళ్లలో పూర్తిగా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ జేబు సంస్థగా మారిపోయింది. అవే పోకడలు ఇప్పటికీ కానవస్తున్నాయి. సిబ్బంది నియామకంలో అవకతవకలు చోటు చేసుకున్నట్టు ఆరోపణలు తీవ్రస్థాయిలో వెల్లువెత్తుతున్నాయి. పెద్దమొత్తంలో సొమ్ములు చేతులు మారినట్టు స్థానిక ప్రజా ప్రతినిధి దృష్టికి తీసుకువెళ్లింది. ఇదే విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి ఎమ్మెల్యే తీసుకువెళ్లారు. విశ్వవిద్యాలయంలో పరిస్థితులను వివరించారు.

విద్యార్థులకు ఇబ్బందులు

కొంత కాలంగా విద్యార్థినులు చీకట్లోనే మగ్గాల్సి వచ్చింది. విద్యార్థినుల హాస్టల్ వసతి గృహానికి సోలార్ విద్యుత్‌ను అమర్చారు. అయినా సరే చీకట్లో ఉండక తప్పలేదు. ఇప్పటికీ సమస్యలు వెంటాడుతున్నాయి. భోజన వసతి కూడా సవ్యంగా ఉండడం లేదంటూ విద్యార్థులు మొల్లుమంటున్నారు. ఈ విషయమై అధికారులకు అడిగే సాహసం చేయలేకపోతున్నారు. ఇటీవల విద్యార్థినులపై లైంగిక వేధింపుల విమర్శలు వినిపించాయి. దాంతో సదరు ఉద్యోగిని విధుల నుంచి తప్పించారు. సస్పెండ్ చేశారు.

విద్యా సంస్థ అధికారుల ఇష్టారాజ్యం

విద్యా సంస్థలో రూ. 3 కోట్ల విలువైన ఫర్నీచర్ కూడా మాయమైంది, ఎవరికి తోచిన రీతిలో వారంతా దోచుకునే పరిస్థితి గత ఐదేళ్లలో తలెత్తింది. అభివృద్ధి లేదు. ప్రభుత్వం నుంచి నిధులు కూడా అందుబాటులో లేవు. గతంలో విమర్శలను ఎదుర్కొని బదిలీపై వెళ్లిపోయిన అధికారికి ఇప్పుడు మళ్లీ బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం సీనియర్ ఆయనే అంటూ ఇన్‌చార్జి బాధ్యతల్లో కూర్చోబెట్టారు. సిబ్బందిని ప్రక్షాళన చేయడంలో సదరు ఇన్‌చార్జి అధికారిపై సానుకూల దృక్పథం ఉంది. కానీ వైసీపీ హయాంలోనే కీలకంగా వ్యవహరించిన అధికారులు ఇప్పటికీ ఉన్నారు. వారినే ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినాసరే వైసీపీ అధిష్ఠానానికి మేలు చేకూర్చే విధంగా వారి సొంత పత్రికలో ప్రకటనలు కూడా ఇచ్చారు. ఏమంటే రోస్టర్ విధానమంటూ చెప్పుకొచ్చారు. గడచిన ఐదేళ్లలో రోస్టర్ విధానం లేదు. ఒకే ఒక్క విధానం అమలు చేశారు. వైసీసీకి పూర్తిగా దాసోహమయ్యారు. వైసీపీ అధిష్ఠానా నికి సంతృప్తి చేసే విధానాలనే అమలు చేశారు. అంతే తప్పా విద్యా సంస్థ అభివృద్ధికి ఇసుమంత చర్యలు తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే పంథాను అనుసరించారు. రోస్టర్ విధానమంటూ ఇప్పుడు వైసీపీ అధిష్ఠానం సొంత పత్రికకు మేలు చేకూర్చేలా కలం తిప్పారు. అదే వాసనలు ఇప్పటికీ పోలేదు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే కూడా దృష్టి పెట్టారు. గతంలో స్థానిక వైసీపీ నేత ఎంత చెపితే అంత. ఆయనకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు నియమించుకునేలా ఏర్పాట్లు చేశారు. ఉద్యోగాల విషయంలో మేళ్లు చేకూర్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంతా గుట్టు చప్పుడు కాకుండా చక్కబెట్టుకుంటున్నారు. ఉద్యోగాల విషయంలోనూ అధికారులు చేతులు తడుపుకుంటున్నారన్న విమర్శలు జోరందుకున్నాయి.

9 వరకు పట్టభద్రుల ఓటు దరఖాస్తుకు గడువు

పశ్చిమలో అధికంగా 60,816 దరఖాస్తులు అందజేత

భీమవరం టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల నియోజకవర్గంలో ఇంకా దరఖాస్తుచేసుకోని పట్టభద్రులకు వచ్చేనెల 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఈనెల 23న డ్రాఫ్టు ఎలక్ట్రోరల్‌ను విడుదల చేశారు. అందులో 2లక్షల 61వేల728 మంది నమోదు చేసుకున్నారని ప్రకటించారు. ఇందులో కూడా అత్యధికంగా పశ్చిమలోనే 60వేల 816 వచ్చినట్లుగా అధికారులు ప్రకటించారు. వీటి ఆధారంగా డ్రాఫ్టును విడుదల చేశారు. ఈ డ్రాఫ్టులో నమోదు చేసిన ఓటర్ల వివరాలను పరిశీలించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే కూడా వచ్చేనెల 9వ తేదీలోగా ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉంది. కొత్తగా దరఖాస్తులు అందించేందుకు అవకాశం ఉంది. అది కూడా ఎంపిక చేసిన కేంద్రా ల్లోను, ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చు.

మరో 10 వేల దరఖాస్తులు వచ్చే అవకాశం

వచ్చే నెల 9వ తేదీ వరకు పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటు నమోదుకు అవకాశం ఉండటంతో దరఖాస్తులు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దాదాపు మరో 10వేలు పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. పట్టభద్రుల నియోజకవర్గంలో పరిశీలిస్తే పశ్చిమ మొదటి స్థానంలో ఉండగా అత్యల్పంగా అల్లూరిసీతారామరాజు జిల్లా ఉంది. అక్కడ 3,336 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. రెండోస్థానంలో కాకినాడ జిల్లా ఉండగా అక్కడ 55,958 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం పెట్టిన డ్రాఫ్టు ఎలక్ట్రోరల్ పోలింగ్ బూత్‌ల వారీగాను, తహసీల్దార్ కార్యాలయాలు, ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉందని చెబుతున్నారు. అనర్హులు ఎవరైనా దరఖాస్తులు చేసుకున్నా ఫిర్యాదుల చేసేందుకు అవకాశం ఉంది. వచ్చేనెల 30న తుది ఓటర్ల జాబితాను అధికారులు ప్రకటిస్తారు.

తణుకులో 30 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి అడుగులు

- అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆరిమిల్లి ప్రస్తావన
- గతంలోనే ప్రతిపాదనలు
- వేల్పూరులో స్థలం కేటాయింపు
- వైసీపీ ప్రభుత్వం రాకతో మూలకు..

6

వీధి వ్యాపారులకు రుణాలు



- ఆత్మ నిర్భర నిధి పక్షోత్సవం
- ఉమ్మడి జిల్లాలో వీధి వ్యాపారుల గుర్తింపు
- రుణాలకు దరఖాస్తులు

7



చిగురిస్తున్న ఆశలు

తణుకులో 30 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి అడుగులు
అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆరిమిల్లి ప్రస్తావన
గతంలోనే ప్రతిపాదనలు
వేల్పూరులో స్థలం కేటాయింపు
వైసీపీ ప్రభుత్వం రాకతో మూలకు..

తణుకు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తణుకు ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణంపై కార్మికులుకు ఆశలు చిగురిస్తున్నాయి. ఏళ్ళ తరబడి సొంత భవనం, కనీస సౌకర్యాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్మికులు సమస్యలపై ఇటీవల అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రస్తావించారు. ఆసుపత్రి నిర్మాణం గురించి మాట్లాడారు. గతంలోనే 30 పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం ప్రతిపాదన చేశారు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నపుడు వేల్పూరులోని బైపాస్ రోడ్డు సమీపంలో 1.14 సెంట్లు భూమిని ఆసుపత్రి నిర్మాణం కోసం కేటాయించారు. ఈఎస్ఐ ఉన్నతాధికారులు స్థల పరిశీలన కూడా చేశారు. తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో ప్రతిపాదన అటకెక్కింది. కూటమి ప్రభుత్వంలో ఆసుపత్రి నిర్మాణం జరిగితే కార్మికుల కల తీరినట్టే.

30 వేల వరకు కార్మికులు

పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన తణుకులో ఉన్న ఈఎస్ఐ ఆసుపత్రి పరిధిలో 20 వేల కార్మికులు నమోదై ఉన్నారు. వారితో పాటు కుటుంబ సభ్యులు కలసి మరో పదివేలు ఉంటారు. తణుకుతో పాటు తాడేపల్లిగూడెం, పాలకొల్లు, భీమవరం, వేంద్ర పరిశ్రమలతో పాటు చుట్టు పక్కల స్పిన్నింగ్, స్ట్రా బోర్డు, పేపరు బోర్డు పరిశ్రమలు ఉన్నాయి. ఇక్కడ పనిచేసే కార్మికలు తణుకు ఆసుపత్రికే వస్తారు. వీరికి అవసరమైన చికిత్సల కోసం రాజమండ్రి లేదా విజయవాడ వెళ్లాల్సివస్తోంది.

అరకొర సేవలే

ప్రస్తుతం ఉన్న ఆసుపత్రిలో ఉండాల్సిన వైద్యులు, సిబ్బంది, మందులు వంటివి కూడా పూర్తి స్థాయిలో లేవు. కనీసం సుగర్ పరీక్షలు కూడా చేయలేని దుస్థితిలో ఉంది. అనేక సంవత్సరాలుగా మహిళా వైద్యులు లేరు. రక్త పరీక్షలకు అవసరమైన కిట్లు అందుబాటులో ఉండటం లేదు. ఇన్సులిన్ సూదులు, టీటీ ఇంజక్షన్‌లు ఉండవు, ఎక్స్‌రే, ఈసీజీ అంటే బయట తీసుకోవాలి. సుగర్ పరీక్షలు చేయడం లేదు. మందులు కూడా సరైనవి ఇవ్వడం లేదని కార్మికులు చెబుతున్నారు. ఆసుపత్రికి వెళ్ళినపుడు ఆన్‌లైన్‌లో కార్మికుడి పేరు ఒకసారి కనిపిస్తే మరో సారి కనిపించదు. దీంతో ఎంతోదూరం నుంచి వచ్చిన కార్మికులు తీవ్ర నిరాశతో వెనుతిరిగి వెళ్ళాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. కనీసం ఇలాంటి సాంకేతిక సమస్యలు కూడా పరిష్కరించడం లేదు.

సిబ్బంది కొరత

డిస్పెన్సరీలో 14 మంది సిబ్బంది ఉండాల్సి ఉంది. కానీ ఏడుగురు మాత్రమే ఉన్నారు. మరో ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ముఖ్యంగా ఇద్దరు వైద్యులు ఉండాలి. ఒక వైద్యుడు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. మరో వైద్యుడు రాజమహేంద్రవరం నుంచి వారానికి మూడు సార్లు వచ్చి సేవలందిస్తారు. అవుట్ సోర్సింగ్ విధానంలో ఇద్దరు నర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. మిగిలిన పోస్టులు భర్తీ అవుతాయో లేదా అనేది ప్రశ్నార్థకంగా మారిందికూ

ప్రక్షాళన చేయాలి



డిస్పెన్సరీలో అన్ని రకాల పరీక్షలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. మహిళా వైద్యురాలిని నియమించాలి. ఆసుపత్రి ప్రాంతంలో కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలి. మందులు ఎపుడు ఒకే కంపెనీకి చెందినవి ఇవ్వాలి. ప్రతి మూడు నెలలకు మందులు మార్చడం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించాలి.

పీవీ ప్రతాప్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

సమయాలు మార్చాలి





కార్మికులకు ఆరోగ్యం బాగాలేకున్న కావా ల్సిన సెలవులు మంజూరు చేయడం లేదు. బయట రక్తపరీక్షలు తీసుకొస్తే ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని చెబుతున్నారు. అనారోగ్యంతో వచ్చిన కార్మికులు ఇబ్బందులు తప్పడం లేదు. పని వేళల్లో మార్పులు తీసుకురావాలి. గతంలో ఉన్నట్టు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 వరకు, తర్వాత 4 గంటల నుంచి సాయంత్రం 6 వరకు పనిచేయాలి.

ఆదినారాయణ, సీఐటీయూ మండల అధ్యక్షుడు, గుబ్బల గోపి, కార్యదర్శి

ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు

ఆరిమిల్లి రాధాకృష్ణ, ఎమ్మెల్యే



తణుకులో ముప్పయి పడకల ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం కోసం అన్ని రకాలుగా కృషి చేస్తున్నాను. గతంలో కార్మికులు అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని వేల్పూరులో స్థలం కేటాయించాం. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఇప్పుడు గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నాను. దశలవారీగా ఆసు పత్రిలో అన్ని సేవలు అందించేలా చర్యలు తీసుకుంటాం. కార్మికుల శ్రేయస్సు కోసం అన్ని చర్యలు తీసుకుంటాం.

సివిల్స్ ఉచిత శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని ఆరు జిల్లాలకు చెందిన అభ్యర్థులకు ఈ నెల 27న స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు కేఎస్ జ్యోతి తెలిపారు.ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్ర్కీనింగ్ పరీక్షకు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల సమీపంలోని బీసీ స్టడీసర్కిల్ కార్యాలయం వద్దకు హాజరుకావాలన్నారు. అభ్యర్థులు తమ ఆధార్‌కార్డులు తీసుకుని ఉదయం 10 గంటలకు బీసీ స్టడీ సర్కిల్ వద్దకు రావాలన్నారు.

నిత్య అన్నదానానికి రూ.2 లక్షల విరాళం

యలమంచిలి, నవంబరు 25,(ఆంధ్రజ్యోతి) :యలమంచిలి మండలం అడవిపాలెం పంచ ముఖ అంజనేయస్వామి ఆలయంలో నిత్య అన్నదానానికి దాతలు విరాళంగా రూ.2 లక్షలు నగదును మంత్రి నిమ్మల రామానాయుడు చేతుల మీదుగా సోమవారం ఆలయ కమిటీకి అందచేశారు. దాత గుడాల వెంకట సత్యనారాయణమూర్తి, కుటుంబ సభ్యులు రూ.1 లక్ష అలాగే బండారు లంక గ్రామానికి చెందిన దాత వీరవల్లి రమేష్ (మాస్టారు) రూ.1 లక్ష అందజేశారు. పెచ్చెట్టి బాబు, బోనం నాని, చెల్లబోయిన శ్రీనివాసు పాల్గొన్నారు.



పలుచనైన పాల ధార



పల్లెలు పాడి పంటలతో అలరారేవి.. ఉదయం పాలకావిడి భుజాన వేసుకుని రైతులు పొలాల బాట పట్టేవారు.. ప్రతి ఇంటా పాడి ఉండేది.. పాలు పుష్కలంగా లభించేవి... లేనివారికి ఉచితంగా కూడా ఇచ్చేవారు.. ఇప్పుడు గ్రామాల్లోనే పాడిసంపద తగ్గి పోయింది.. 70 శాతం పైగా పాడి రైతులు పశువుల పెంపకం వదిలేశారు.. పెరిగిపోయిన దాణా ఖర్చులు, పనిచేసేవారు లేకపోవడం వంటి కారణాలతో పాడి పెంపకానికి రైతులు సెలవు చెప్పారు.. నేడు ప్రపంచ పాల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

భారంగా పాడి పశువుల పెంపకం
సగానికి పడిపోయిన పాల ఉత్పత్తి
రైతులు కూడా ప్యాకెట్లు కొనే పరిస్థితి
పల్లెల్లో కనిపించని పాలకేంద్రాలు
పెరిగిపోయిన దాణా ఖర్చు.. పాడి రైతుల్లో నిరాసక్తత

నేడు ప్రపంచ పాల దినోత్సవం

భీమవరం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో పాలధార తగ్గిపోయింది.. దాదాపు సగంపైగా పాల ఉత్పత్తి పడిపోయింది. పశువుల పెంపకంపై రైతుల్లో ఆసక్తి తగ్గిపోయింది పెంపకం కష్టంతో పాటు పెట్టు



బడి భారం అవడంతో పాడిరైతులు వెనకడుగు వేశారు. రైతులు కూడా పాడి పెంచలేక ప్యాకెట్లు కొంటున్నారు. పదేళ్ల కిందటి పాడి పశువుల పెంపకానికి ఇప్పటికీ ఎంతో మార్పు వచ్చింది సగంపైగా పాడి పశువుల పెంపకం పడిపోయింది. దీంతో పశ్చిమ గోదావరి జిల్లాలో లక్ష 78 వేలు 137 గేదెలు, దూడలు, 45,539 ఆవులు, దూడలు పెంపకం జరుగుతోంది. వీటిలో 90 వేల వరకు గేదెలు పాలు ఇచ్చేవి ఉంటాయి. మిగిలినవి చూడి , ఇంకా పాలు నిలిచిపోయినవి ఉంటాయి. ఆవులు కూడా 25 వేలు ఆవులు పాలు ఇస్తున్నట్లు అంచనా. మొత్తం మీద ఆవులు, గేదెలు పాలు ఉత్పత్తి రోజు 5 లక్షల 50 లీటర్లు వరకు ఉంటుంది. జిల్లాలో జనాభాను బట్టి 10 లక్షలు లీటర్లు వరకు పాల వాడకం ఉంటుంది. అలాగే ఏలూరు జిల్లాలో కూడా మరో పది లక్షల లీటర్ల పాలు వాడుతుంటారు. పాడి పశువుల నుంచి వచ్చిన పాలు కాకుండా సగానికి పైగా ప్యాకెట్ పాలనే ఉపయోగిస్తున్నారు. గతంలో 90 శాతం పాలు పాడి పశువుల నుంచి వచ్చినవే ఉపయోగించేవారు.

పెట్టుబడి భారం..

కాలాన్ని బట్టి అన్ని ధరలు పెరిగినట్లుగా గేదెల ధరలు భారీగా పెరిగాయి. రూ.60 వేలు ధర నుంచి 1 లక్ష 20 వేల వరకు గేదె ధర పలుకుతోంది. దానికి దాణాగా నెలకు రూ.1000 పైన పెట్టాలి. పశువు పెంచడానికి ప్రస్తుత కూలీని బట్టి లెక్క కడితే రోజుకు రూ.500 అవుతుంది. ఈ లెక్కన ఒక పశువు పెంచడానికి నెలకు 20 వేలు అవుతుంది. దాని నుంచి పాల ద్వారా వచ్చేది రూ.15 వేలు ఉంటుంది. ఈ లెక్కన పశువుల పెంపకం తగ్గింది. కొనుగోలు వరిసాగు రైతులే పాడి పశువులు పెంచుతున్నారు.

పాల కేంద్రాలు ఫెయిల్..

పాల ఉత్పత్తి పెంచేందుకు, పశువుల పెంపకం దారులకు సపోర్టు ఇచ్చేందుకు ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన పాల కేంద్రాలు ఫెయిల్యూర్ అయ్యాయి. పాల కేంద్రాలకు పాలు అమ్మిన రైతులకు పెద్దగా ఆదాయం కనిపించలేదు. ఇంటింటికి అమ్మకాలు చేసుకుంటేనే కాస్త మిగులుతోంది. చాలామంది రైతులు కేంద్రాలకు పాలు పొయ్యడం లేదు.

ఉత్పత్తి తగ్గింది.. ధర పెరిగింది..

పశువుల పెంపకం గ్రామాల్లో తగ్గిపోవడంఓ పాల ఉత్పత్తి పడిపోయింది. దీంతో పాల ధర పెరిగిపోయింది. లీటర్ పాలు రూ.60 నుంచి 80 వరకు అమ్ముతున్నారు. కొన్ని చోట్ల లీటరు రూ.100 కూడా అమ్ముతున్నారు. పాలు చిక్కదనం బట్టి రేట్లు ఉంటున్నాయి. దీంతో పాల ఉపయోగంలో పొదుపు మొదలైంది. ఒక కుటుంబంలో రెండు లీటర్లు అవసరమైన వారు లీటరు పాలుతో సరిపెట్టుకుంటున్నారు. గతంలో ఒక కుటుంబం నాలుగు లీటర్లు పైగా పాలు ఉపయోగించేవారు. అప్పట్లో పాలు పెద్ద కుటుంబాలు లేని వారికి ఉచితంగా కూడా అందించేవారు.

నెయ్యి బదులు డాల్డా..

పాల నుంచి ఉత్పత్తి అయ్యే నెయ్యి వాడకం బదులు కృత్రిమంగా ఉపయోగించే డాల్డా ఉపయోగం పెరిగింది. స్వీట్లు, ఇతర వంటకాలలో డాల్డా 90 శాతం వాడేస్తున్నారు. స్వచ్ఛమైన నెయ్యి కరువైంది. దీనికి కారణం పాలు సరిపడగా ఉండకపోవడం.. పౌడర్ పాల ప్యాకెట్ల నుంచి నెయ్యి రాదు.. అందుకే సచ్ఛమైన నెయ్యి దొరకడం కష్టంగా మారింది. శుభకార్యాలలో, భోజనాలకు ఉపయోగించే పెరుగును కంపెనీల పెరుగులనే ఉపయోగిస్తున్నారు.

పెంపకం భారమైంది



పాడి పశువుల పెంపకంలో చాలా మార్పు వచ్చింది. ఇప్పుడు పశువుల పెంపకం ఖరీదుగా మారింది. పాల ఉత్పత్తి తక్కువ..కష్టం, పెట్టుబడి ఎక్కువ అయ్యింది. అందువల్ల ఇంటికో పాడి పశువు కాస్తా పది ఇళ్ళకు ఒకటిగా మారింది. గేదెపాలు అలవాటు పడినవారు కష్టమైనా పశువులు పెంచుతున్నారు.

- కె.పద్మారావు ,పశువుల పెంపకం దారుడు, భీమవరం మండలం

ఖర్చు లెక్కవేస్తే కొనడమే మేలు



వ్యవసాయం చేస్తూ పశువులను అలవోకగా పెంచేవాళ్లం. ఇంట్లో పాడి నిండుగా ఉండేది. ఇప్పుడు అలా లేదు. గేదె ధరలు పెరిగిపోయాయి. దాణా బస్తా రూ.1300 అయ్యింది. ఎండు గడ్డి ట్రాక్టర్ 10 వేలు అయ్యింది. ఇవన్నీ లెక్క వేస్తే పాలు కొనుగోలు మేలనిపిస్తుంది. స్వచ్ఛమైన పాలు దొరకక గేదెలను పెంచుతున్నాను.

-బ్రహ్మయ్య, పాడి రైతు, తాడేరు గ్రామం

అమ్మ మాటకు ఆదరణ





యూట్యూబ్ ద్వారా లక్షలమందికి చేరువైన జయ ఆనంద్

అమ్మమాట.. అంటూ ఆమె అందరికీ దగ్గరైంది.. ప్రతిరోజూ తన దైనందిన జీవితంలో జరిగే అన్ని విషయాలతో పాటు ఆధ్యాత్మిక, సామాజిక అంశాలపై ఆమె చెప్పే మాటలు ఆకట్టుకుంటాయి.. చక్కని భాషతో తీయని గొంతుతో రోజూ ఆమె చెప్పే కబుర్లు వినేందుకు వేల సంఖ్యలో సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. అమ్మ మాట.. ఈ యూట్యూబ్ చానల్ బాగా ట్రెండింగ్‌లో ఉంది.. ఎన్నో సబ్జెక్ట్‌లతో సామాజిక మాధ్యమాలు వీక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి..కానీ కొన్ని ఛానల్స్ ప్రత్యేకతో ఉంటాయి. అమ్మ మాట విభిన్నమైన అంశాలతో ప్రతీరోజు ఉదయాన్నే వీక్షకులను పలకరిస్తుంది. భీమవరానికి చెందిన కర్రి జయ ఆనంద్ తన వాయిస్‌తో ఎంచుకున్న అంశాన్ని విపులంగా వివరించడం ద్వారా విజయవంతమయ్యారు. ఇప్పుడు యువతరం రకరకాల టెక్నిక్‌లతో యూట్యూబ్‌లో ఆకర్షించే ప్రయత్నాలు చేస్తుంటే జయ ఆనంద్ మాత్రం 58 ఏళ్ల వయస్సులో తనకంటూ ఒక కొత్త ఇమేజ్‌ని సృష్టించుకుని లక్షలాది మంది వీక్షకుల అభిమానాన్ని పొందడం వెనుక ఎంతో కృషి ఉంది. ప్రతీరోజు మధ్యాహ్నం ఒంటిగంటకు అమ్మ మాట కొత్త వీడియో స్ట్రీమింగ్‌లోకి వస్తుంది. ఆ సమయంలో వచ్చే సీరియల్‌లను కూడా చూడమని అమ్మ మాట కోసం ఎదురు చూస్తామని ప్రేక్షకులు ప్రతీ రోజు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ ఉంటారు. భీమవరంలో లోకల్ న్యూస్ ఛానల్‌కు రెండు దశాబ్దాల పాటు న్యూస్ రీడర్‌గా సుపరిచితమైన ఆమె ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా ఎంతోమంది అభిమానాన్ని పొందుతున్నారు. ఈ ఛానల్‌లో ఆధ్యాత్మిక చింతన, లైఫ్ స్టైల్, మానవ సంబంధాలు, బ్యూటీ , మహిళలు ఎదుర్కొనే కుటుంబ సమస్యలను ప్రస్తావిస్తూ వీడియోలు చేస్తున్నారు. జీవితంలో ప్రాక్టికల్‌గా ఎదురయ్యే సమస్యలను జోడిస్తూ వాటికి పరిష్కారం కూడా వీక్షకులను ఆకట్టుకునే విధంగా చెప్పగలగటం జయ ఆనంద్ సొంతం. వీక్షకుల మనోభావాలకు అనుగుణంగా కంటెంట్‌ను రూపొందించుకోవడమే తన విజయమని ఆమె చెబుతున్నారు. తన సూచనలు, సలహాల ద్వారా ఇతరుల సమస్యల పరిష్కారమైతే తన శ్రమకు ఫలితం లభించినట్టే.. అంటున్నారు.. ఇప్పటి వరకు 3 లక్షల 65 వేల మందికి పైగా వ్యూయర్స్ ఉన్నారని ఆమె చెప్పారు. కొంత మంది వీక్షకులు భీమవరం గునుపూడిలో ఉన్న ఆమె నివాసానికి వచ్చి వారితో సంభాషించి తమ అభిమానాన్ని చాటుకుంటూ ఉంటారు.

- భీమవరం రూరల్



మహిళల బాస్కెట్ బాల్ జట్టు ఎంపిక

పెనుమంట్ర, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మార్టేరు వైబీఏ ఆధ్వర్యంలో నిర్వహించే ఎమ్మెల్యే బాస్కెట్‌బాల్ కప్ టోర్నమెంట్‌కు మహిళల జట్టును ఎంపిక చేసినట్లు వైబీఏ అధ్యక్షుడు చిర్ల బాలాజీ రెడ్డి తెలిపారు. లీలావతి, భవానీదేవి, అనిత, నాగదేవి, జ్యోతి, వినయశ్రీ, లక్ష్మీ ప్రవల్లిక, జయశ్రీ నిఖిలరెడ్డి రుత్విక ,పూజిత, పూర్ణచంద్రిక, యామిని ఎంపికయ్యారు.



కరాటే ఛాంపియన్‌గా భీమవరం విద్యార్థి

ఆకివీడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) :.రాష్ట్ర స్థాయి కరాటే పోటీల అసోసియేషన్ సభ్యుడు షేక్ ఎజ్‌దాన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆకివీడు షాదీఖానాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో భీమవరం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థి వై.గీత్‌పవన్ ఛాంపియన్‌గా నిలిచాడు. తెలంగాణ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ చైర్మన్ మహమ్మద్ జహంగీర్ కప్ అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఏడు జిల్లాల నుంచి సుమారు 700 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఏపీ, తెలంగాణ కరాటే మాస్టార్లను ఘనంగా సన్మానించారు.

హర..హర మహాదేవ







కార్తీకమాసం ఆఖరి సోమవారం ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.. కార్తీక దీపాలు, అభిషేకాలు, పూజలతో ఆలయాలు కిటకిటలాడాయి..

భీమవరం మావుళ్లమ్మ ఆలయంలో కోటి దీపోత్సవ దృశ్యాలు



గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయంలో భక్తుల క్యూ





నరసాపురం వలందర్‌రేవులో దీపాలు వదులుతున్న భక్తులు





నిడమర్రు మండలం మందలపర్రులో హారతి



గునుపూడి సోమేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

హనుమాన్ విగ్రహం మాయం

అర్ధరాత్రి ఏర్పాటు చేశారు.. ఉదయానికి లేదు..!

ఆచంట వేమవరంలో గుర్తుతెలియని వ్యక్తుల చర్యలు



మాయమైన ఆంజనేయుడి విగ్రహం ఇదే

ఆచంట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆచంట వేమవరంలో ఆదివారం అర్ధరాత్రి ప్రతిష్ఠించిన ఆంజనేయుడి విగ్రహం ఉదయానికి మాయం కావడం చర్చనీయాంశమైంది. ఆచంట నుంచి పాలకొల్లు రహదారి పక్కన ఎ.వేమవరం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం ఈ విగ్రహాన్ని చూసిన ప్రతీ ఒక్కరూ రాత్రికి రాత్రే విగ్రహం ఎవరూ నెలకొల్పారు అంటూ గ్రామస్థులు తర్జనభర్జనపడ్డారు. మరలా ఉదయం పది గంటల తరువాత ఎవరికీ తెలియకుండానే విగ్రహం మాయమైంది. ఈ సంఘటనతో స్థానికులు ఆశ్చర్యపోయారు. గ్రామంలో చర్చనీయాంశం కావడంతో పాటు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. విగ్రహం ఏర్పాటుచేసి కొన్ని గంటల సమయంలో మాయం చేయడం స్థానికంగా సంచలనంగా కలిగించింది. ఈ సంఘటనకు కారకులెవరు.. ఎందుకు ఇలా చేశారుని అందరూ చర్చించుకుంటున్నారు.

ఇప్పటికే విగ్రహాలు, ఫ్లెక్సీల వివాదం

గ్రామంలోని పార్వతి చెరువు ప్రాంతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇదే చోట బాబూజగ్జీవన్‌రాం, అంబేడ్కర్ విగ్రహాలను ఏర్పాటు చేయడానికి ప్రయత్నించగా అప్పట్లో వివాదం ఏర్పడింది. దీంతో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయలేదు. ఇటీవల చాకిరేవు చెరువు వద్ద రెండు కులాల వారి విగ్రహాల ఏర్పాటులో వివాదం నెలకొంది. స్థానిక రైతు అధికారులు విగ్రహాల ఏర్పాటును అడ్డుకునే ప్రయత్నం చేశారు. తాజాగా అర్ధరాత్రి సమయంలో ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు, ఉదయానికి మాయం చేయడం గందరగోళానికి దారితీసింది. కావాలనే కొంత మంది గొడవలు పెట్టడానికి ఇలా చేసి ఉంటారని పలువురు భావిస్తున్నారు.

ఏలూరు మీదుగా శబరిమలకు రైళ్లు



ఏలూరు క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి భక్తుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేకంగా విశాఖపట్నం, శ్రీకాకుళం నుంచి శబరిమలై ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు విజయవాడ డివిజన్ అధికారులు సోమవారం తెలిపారు. విశాఖపట్నం - కొల్లాం (రైల్‌నెంబర్ 08539) డిసెంబర్ 4న విశాఖలో ఉదయం 8.20 గంటలకు బయలుదేరి 5న 12.55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. ఈ రైలును 2025 ఫిబ్రవరి 26 వరకూ నడపనున్నారు. విశాఖపట్నం - కొల్లాం (08540) రైలు కొల్లాంలో డిసెంబర్ 5న కొల్లాంలో రాత్రి 7.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు అర్ధరాత్రి 11.20 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ రైలును డిసెంబర్ 5 నుంచి 2025 ఫిబ్రవరి 27 వరకూ నడపనున్నారు. శ్రీకాకుళం రోడ్డు - కొల్లాం (08553) రైలు శ్రీకాకుళం రోడ్డులో డిసెంబర్ 1న ఉదయం 6 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 2 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. ఈ రైలును డిసెంబర్ 1 నుంచి 2025 జనవరి 26 వరకూ నడపనున్నారు. కొల్లాం - శ్రీకాకుళం రోడ్డు (08554) రైలు డిసెంబర్ 2న కొల్లాంలో సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి 4న అర్ధరాత్రి 2.30 గంటలకు శ్రీకాకుళం రోడ్డుకు చేరుకుంటుంది. ఈ రైలును డిసెంబర్ 2 నుంచి జనవరి 27 వరకూ నడపనున్నారు. విశాఖపట్నం - కొల్లాం - విశాఖపట్నం నడిచే రైళ్లు దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణికుంట, కాట్పాడి, జాలర్‌పెట్టయ్, సేలం, ఈరోడ్, తిరుపూర్, పొదనూర్, పాల్కాట్, తిరుచూర్, ఆల్వా, ఎర్నాకుళంరోడ్డు, కొట్టాయం, చత్రగంజి, తిరువెళ్ళ చెంగనూర్, మేవలికెర, కాయంకులం స్టేషన్లలో ఆగనున్నాయి. శ్రీకాకుళం రోడ్డు - కొల్లాం - శ్రీకాకుళం రోడ్డు రైళ్లు పొందూరు, చీపురుపల్లి, విజయనగరం, కొత్తవలస, పెందుర్తి, దువ్వాడ, అనకాపల్లి, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు. గూడూరు, రేణికుంట, కాట్పాడి, జాలర్‌పెట్టయ్, శాలం, ఈరోడ్, తిరుపూర్, పొదనూర్, పాల్కాట్, తిరుచూర్, ఆల్వా, ఎట్టుమన్నూర్, ఎర్నాకుళం టౌన్, కొట్టాయం, చత్రగంజి, తిరువెళ్ళ చెంగనూర్, మేవలికెర, కాయంకులం స్టేషన్లలో ఆగనున్నాయి. ఈ రైళ్లలో టూటైర్ ఏసీ, త్రీ టైర్ ఏసీ, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో ఖాళీ పోస్టులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్ర



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్ర

పాలకొల్లు అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ సమస్య పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర అన్నారు. తక్షణమే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో రాజేంద్ర మాట్లాడారు. సీఎం చంద్రబాబు అధికారం చేపట్టి ఆరు నెలలైందని, ఎమ్మెల్సీ ఎన్నికల (టీచర్స్, గ్రాడ్యుయేట్స్) అనంతరం కాలయాపన చేయకుండా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్‌లో గతంలో జరిగిన సంఘటనల దృష్ట్యా ఏ జిల్లాకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం వివిధ శాఖల్లో 2,35,794 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. గత ఆరేళ్లుగా పోస్టులు భర్తీ చేయలేదని అందువల్ల నిరుద్యోగులు వేలాది మంది వయోపరిమితి దాటిపోవడం జరిగిందన్నారు. ఏఐవైఎఫ్ 22వ మహాసభలు 2025 ఫిబ్రవరి 6నుండి 9వ తేదీ వరకూ శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించనున్నట్టు ఈసందర్భంగా రాజేంద్ర తెలిపారు. సమావేశానికి జిల్లా నాయకుడు పవన్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా, నియోజక వర్గ నాయకులు పాల్గొన్నారు.

13 నుంచి 'అభినయ' జాతీయ నృత్యోత్సవాలు

ఏలూరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో అభినయ నృత్యభారతి ఆధ్వర్యంలో జాతీయ నృత్యోత్సవాలు డిసెంబర్ 13, 14, 15 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు సంస్థ గౌరవాధ్యక్షుడు అంబికాకృష్ణ, వ్యవస్థాపకులు డి.హేమసుందర్ తెలిపారు. పోటీల కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. సుమారు పది రాష్ట్రాల యువ కళాకారులు, నృత్య కౌముది అవార్డులు స్వీకరించనున్నారని హేమసుందర్ తెలిపారు. ఉభయ తెలుగురాష్ట్రాలకు చెందిన 400మంది చిన్నారులు కూచిపూడి, జానపద బృంద నృత్య పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు. పోటీల అనంతరం నృత్య రంగంలో సేవలందించిన గురువులు, వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి నృత్య తపస్వి, సేవా తపస్వి అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వై.జగన్‌మోహన్‌రావు, కె.వేణుబాబు తదితరులు పాల్గొంటారని తెలిపారు.



తరలించేందుకు సిద్ధం చేసిన జామాయిల్ దుంగలు, ఏపీఎఫ్‌డీసీ దర్భగూడెం బీట్‌లో లారీ

జామాయిల్ తరలింపు యత్నం

అధికారులకు సమాచారం అందడంతో లారీ వదిలి పరార్

జీలుగుమిల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏపీఎఫ్‌డీసీ (ఏపీ ఫారెస్టు డవలప్‌మెంట్ కార్పొరేషన్) దర్భగూడెం బీట్ పరిధిలో జామాయిల్ కలప తరలించేందుకు కొందరు ప్రయత్నించారు. రెండు రోజుల క్రితం జామాయిల్ అడవిలోకి నేరుగా కూలీలతో లారీ వచ్చింది. అడవిలో ఎండిన జామాయిల్ కర్రలు తరలించేందుకు రంగం సిద్ధం చేశారు. కూలీలతో లారీపై లోడు చేస్తుండగా గిరిజనులు అడగడంతో తమకు అనుమతులు ఉన్నాయని చెప్పారు. ఈ విషయం కార్పొరేషన్‌లో కిందిస్థాయి సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనితో కలప తరలించడానికి సిద్ధమైన వారు లారీలో కొన్ని జామాయిల్ దుంగలు మరోచోట దించారు. మిగిలిన కర్రలు లారీ వద్ద దిగుమతి చేసి పరారయ్యారు. ఏపీఎఫ్‌డీసీ ప్లాంట్ మేనేజర్ వసంతకుమారి సిబ్బందితో కలసి సోమవారం విచారించారు. లారీకి సంబంధించిన వారు అందుబాటులో లేరని, దీని వెనుక కిందిస్థాయి ఉద్యోగుల హస్తం ఉన్నట్లు కొందరు చెబుతున్నారు. ఈ సంఘటనపై సంబంధిత అధికారి కోసం ప్రయత్నించగా ఆమె ఫోన్ అందుబాటులోకి రాలేదు. అ సంఘటనపై అధికారుల విచారణ జరుపుతున్నట్లు సమాచారం.



పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఉభయగోదావరి జిల్లాలోని వీధి వ్యాపారుల కోసం ప్రధానమంత్రి వీధి విక్రయదారుల ఆత్మ నిర్భర నిధి కింద 'స్వనిధి కూడా- స్వాభిమానం కూడా' పక్షం పేరిట కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వచ్చే నెల 2 వరకు జిల్లాలోని అన్ని పట్టణాల్లో వీధి వ్యాపారులకు రుణాలు మంజూరు చేయిస్తారు.

వీధి వ్యాపారులకు రుణాలు



• ఆత్మ నిర్భర నిధి పక్షోత్సవం • ఉమ్మడి జిల్లాలో వీధి వ్యాపారుల గుర్తింపు • రుణాలకు దరఖాస్తులు

భీమవరం టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మెప్మా ఆధ్వర్యంలో గతంలోనే వీధి వ్యాపారులను గుర్తించి బ్యాంకు రుణాల కోసం దరఖాస్తు చేయించారు. బ్యాంకు అధికారులతో సంప్రదించి వారికి రుణాలు మంజూరు చేయిస్తారు. ఇందుకోసం 4 అంశాలతో మెప్మా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 13356 మంది వీధి వ్యాపారులకు రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ పథకం దేశవ్యాప్తంగా అమలు జరుగుతోంది. ఈ పథకంపై మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్ ఆధ్వర్యంలో అమలుకు చర్యలు చేపడుతున్నారు.

దరఖాస్తులు పెండింగ్

మునిసిపాల్టీల వారీగా ఇప్పటికే బ్యాంకుల్లో రుణాల కోసం వీధి వ్యాపారుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. సంబంధిత బ్యాంకు అధికారులతో మాట్లాడి రుణాలు మంజూరు కు సిబ్బంది కృషి చేస్తారు. రుణాల కోసం వ్యాపారులతో కొత్తగా దరఖాస్తు చేయిస్తారు.

సామాజిక ఆర్థిక ప్రొఫైల్ నమోదు

వీధి వ్యాపారుల ఆర్థిక ప్రొఫైల్‌నమోదు చేస్తారు. కుటుంబ సభ్యుల వివరాలు, వారికి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్ర సామాజిక భద్రత పథకాల్లో వారిని నమోదు చేయించి, బీమా తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. అదేవిధంగా బ్యాంకు ఎల్‌డీఎం, కార్మిక, వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వ్యాపారులకు అవగాహన కల్పిస్తారు.

డిజిటల్ లావాదేవీల పెంపు

వీధి వ్యాపారలతో డిజిటల్ లావాదేవీలు పెంచేలా వారికి క్యూఆర్ కోడ్‌లు జారీ చేయిస్తారు. డిజిటల్ లావాదేవీల నిర్వహణపై అవగాహన కల్పించారు. మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడంలో సూచనలు ఇస్తారు.

పట్టణాల్లో సమావేశాలు

ఈ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు కమిషనర్ల ఆధ్వర్యంలో మెప్మా సిబ్బందికి అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. వీధి వ్యాపారులకు ప్రయోజనం చేకూర్చడం పై సూచనలు ఇస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఈ పథకంపై చర్యలు చేపట్టి మునిసిపాల్టీల వారీగా లక్ష్యాలు నిర్దేశించారు.

మునిసిపాలీ	టార్గెట్	ప్రొఫైల్ పెండింగ్	రుణాల పెండింగ్	స్కీమ్స్ పెండింగ్
ఏలూరు	3720	1259	292	957
జంగారెడ్డిగూడెం	1258	384	73	78
నూజివీడు	1250	259	121	492
భీమవరం	2322	881	333	532
తణుకు	1136	321	353	90
తాడేపల్లిగూడెం	1539	335	110	0
పాలకొల్లు	1464	524	425	1747
నరసాపురం	667	193	64	1827
మొత్తం	4156	1771	5723	13356

పోలీసు శాఖలో పదోన్నతి పరీక్షలు



పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఐజీ, ఎస్పీ, పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

పెదవేగి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం(డీటీసీ)లో పోలీస్ ఉద్యోగుల పదోన్నతులకు అర్హత పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ. అశోక్‌కుమార్ పరీక్ష ఏర్పాట్లను పరిశీలించారు. రేంజ్ పరిధిలోని ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు, ఉమ్మడి కృష్ణా జిల్లాల సిబ్బందికి పదోన్నతి పరీక్షలు రెండు రోజులపాటు జరుగుతాయని ఆయన తెలిపారు. హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలు 115 మంది పరీక్షలకు హాజరయ్యారని ఆయన తెలిపారు. పటిష్ట భద్రత నడుమ, ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పరీక్షలను నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. జంబ్లింగ్ విధానంలో పరీక్షల నిర్వహిస్తున్నామన్నారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా అధికారుల పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఉదయం, సాయంత్రం రెండు దఫాలుగా పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు. ఆయన వెంట ఏలూరు ఎస్పీ కె.కిశోర్, పోర్త్ బెటాలియన్ కమాండెంట్ సీవీఏ.రామకృష్ణ, ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, డీటీసీ డీఎస్పీ సీహెచ్‌వీ.ప్రసాదరావు, తూర్పుగోదావరి జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వుడ్ ఏఎస్పీ చెంచురెడ్డి, ఏఆర్ ఏఎస్పీ ఎన్ఎస్ఎస్.శేఖర్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, మహిళా ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

పాలకొల్లు ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్

» పనులు వేగవంతం చేయండి

» అధికారులకు మంత్రి నిమ్మల ఆదేశం



ఆస్పత్రి భవన నిర్మాణ వివరాలు తెలుసుకుంటున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ నెల రోజుల్లో ప్రారంభించేలా పనులు వేగవంతం చేయాలని అధికారులను మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులను మంత్రి నిమ్మల సోమవారం పరిశీలించారు. జగన్ ఐదేళ్ల పాలనలో వంద పడకల ఆసుపత్రి భవనం నిర్మాణ పనులు గాలికొదిలేశారని, కూటమి ప్రభుత్వం ఏర్పడగానే నిర్మాణ పనులుపై దృష్టి పెట్టామన్నారు. డయాలసిస్ సెంటర్ లేక పాలకొల్లు పరసర ప్రాంతాల రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటుకు హామీ ఇచ్చామన్నారు. రాష్ట్రంలో రెండు డయాలసిస్ సెంటర్లు మంజూరు కాగా ఒకటి ఇక్కడ ఏర్పాటుచేసి ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నామన్నారు. వంద పడకల ఆసుపత్రి కొత్త భవనంలోనే డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి నిమ్మల తెలిపారు. ముందుగా ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆయన ఆరా తీశారు. కూటమి నాయకులు, అధికారులు, వైద్యసిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

క్రైమ్ కార్నర్



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

లారీని ఢీకొన్న కారు

నలుగురికి తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని వెనక నుంచి కారు ఢీకొనడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. విజయవాడకు చెందిన సమ్మెట నాగ సత్యనారాయణ, సమ్మెట పద్మజ, సమ్మెట డింపుల్ సాయి శ్రీజ (25), రామశెట్టి నాగ జగదీశ్వరి సోమవారం మచిలీపట్నం నుంచి ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి కారులో వెళుతున్నారు. ఏలూరు సమీపంలోని జాతీయ రహదారిపై లారీని వెనుక నుంచి కారు ఢీకొంది. కారులో ఉన్న నలుగురు తీవ్రంగా గాయపడడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు.

ప్రమాదంలో గాయపడి.. చికిత్స పొందుతూ ఒకరి మృతి

పెనుమంట్ర, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పొలమూరు - బ్రాహ్మణచెరువు రహదారి పక్కన కంకర గుట్ట వద్ద ప్రమాదానికి గురైతీవ్ర గాయాలతో చికిత్సపొందుతున్న వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. గణపవరానికి చెందిన జె.దాస్ ఆదివారం రాత్రి మోటార్ సైకిల్‌పై వీరవాసరం వెళుతూ కంకర గుట్టను ఢీకొన్నాడు. తలకు బలమైన గాయం కావడంతో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందాడు. ఆస్పత్రి వర్గాల సమాచారంతో పెనుమంట్ర ఎస్సై స్వామి కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని మహిళ మృతి

ఏలూరు క్రైం/దెందులూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళ రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందింది. దెందులూరు మండలం సీతంపేటకు చెందిన కాలి కాంతమ్మ (58)కు కొంతకాలం నుంచి మతిస్థిమితం లేదు. సోమవారం ఉదయం బహిర్భూమికి వెళ్లడానికి ఇంటి సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో మృతి చెందింది. రైల్వే ఎస్ఐ పి.సైమన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

కారు అద్దెకు తీసుకుని.. తాకట్టు పెట్టేస్తారు

» ఇద్దరి అరెస్ట్

» ఆరు కార్లు స్వాధీనం




పోలీసుల అదుపులో నిందితులు

ఏలూరు క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్లను అద్దెకు తీసుకుంటారు.. రెండు నెలలు సక్రమంగా అద్దె కట్టేస్తారు. తర్వాత వాటిని గుట్టుచప్పుడు కాకుండా వేరే ప్రాంతంలో తాకట్టు పెట్టేస్తారు. కార్లను అద్దెకు ఇచ్చిన వారిని, తాకట్టు పెట్టుకున్న వారిని తప్పించుకు తిరుగుతారు. బాధితుల ఫిర్యాదుతో ఇద్దరు నిందితులను ఏలూరు త్రీ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ కేసు వివరాలను తెలిపారు. ఏలూరు సత్రంపాడు విద్యావికాస్ వీధికి చెందిన ముంగర అశోక్ తంగెళ్ళమూడిలో నివాసం ఉంటున్నాడు. పత్తేబాదకు చెందిన ఎల్లపు భానుచందర్‌తో కలిసి నెలవారీ అద్దెకు కారు కావాలని డ్రైవర్, ఆయిల్ తామే చూసుకుంటామని నమ్మబలుకుతారు. ఒకటి రెండు నెలలు అద్దె సజావుగా కట్టి తరువాత ఆ కారు వేరే ప్రాంతానికి తీసుకువెళ్లి తాకట్టు పెట్టేస్తారు. తెలిసిన వ్యక్తి ద్వారా తమ కుమారుడు అనారోగ్యంతో ఉన్నాడని అత్యవసరంగా ఆపరేషన్ చేయాలంటూ రూ.15 లక్షల విలువైన కారును ఐదు లక్షలకు తాకట్టు పెడతారు. రికార్డు తరువాత తీసుకువస్తామని వెళ్లిపోతారు. కారు అద్దెకు ఇచ్చిన వారు ఎంత కాలం అడిగినా సమాధానం చెప్పకుండా తప్పించుకు తిరుగుతారు. ఏలూరులో ఆరు కార్లను అద్దెకు తీసుకుని తాకట్టు పెట్టేశారు. బాధితులు ఏలూరు రూరల్, టూటౌన్, త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో సీఐ ఎస్ కోటేశ్వరరావు, ఎస్ఐలు ప్రసాద్, రాంబాబు, సిబ్బంది బృందంగా ఏర్పడి నిందితులు ముంగర అభిషేక్, ఎల్లపు భానుచందర్‌ను సోమవారం అరెస్టు చేశారు. తాకట్టుపెట్టిన ఆరు కార్లను గుర్తించి వాటిని కూడా స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఎవరైనా వాహనాలను తాకట్టు పెట్టుకోవాలంటే కచ్చితంగా యజమాని, ఒరిజినల్ సీ బుక్, అన్ని చూసుకోవాలన్నారు. మధ్యవర్తులు తాకట్టు పెడితే పెట్టుకున్న వారిపై కూడా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. దొంగ సొత్తులను ఎవరు కొన్నా తాకట్టు పెట్టుకున్నా చర్యలు తప్పవన్నారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీతో పాటు త్రీ టౌన్ సీఐ ఎస్ కోటేశ్వరరావు, ఎస్ఐలు కె.ప్రసాద్, రాంబాబు, ఏఎస్ఐ బండారు నాని, కానిస్టేబుల్ నాగరాజు, పలువురు పాల్గొన్నారు.

బైక్, ఆటోలు సునాయాసంగా కొట్టేస్తారు

» ఇద్దరు దొంగలు అరెస్ట్

» వాహనాలు స్వాధీనం



అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న వాహనాలు

పాలకోడేరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు, ఆటోలను వారు సునాయాసంగా కొట్టేస్తారు. జిల్లాలో పలుచోట్ల కొట్టేసిన వాహనాలతో పోలీసులకు పట్టుబడ్డారు. వాహనాల దొంగలను సోమవారం అరెస్ట్ చేసి రూ.7,19,000 విలువ చేసే మోటార్ బైక్‌లు, ఆటో స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గొల్లలకోడేరు గ్రామానికి చెందిన ఈదా ప్రకాశ్, మోగల్లు గ్రామానికి చెందిన రెడ్డి శివ కొంతకాలంగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. విస్సాకోడేరులో 2 మోటర్ బైక్‌లు మోగల్లులో 1, భీమవరం మండలం డేగాపురంలో ఆటో, హైదరాబాద్‌లో పల్సర్ బైక్ దొంగిలించి మోగల్లులోని ఒక పొదలో దాచిపెట్టారు. దొంగతనాలపై ఆయా పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. దొంగిలించిన మోటార్ బైక్‌లు, ఆటో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. భీమవరం రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై మంతెన రవివర్మ ఆధ్వర్యంలో అరెస్టు చేసినట్లు స్టేషన్ రైటర్ నాగరాజు తెలిపారు.

స్కూటర్ డిక్కీలో సొమ్ము కొట్టేశాడు

భీమడోలు, నవంబరు 25: ద్వారకాతిరుమల మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన నందమూరి సత్యనారాయణ బ్యాంక్ ఖాతాలో రూ.2.5లక్షలు సోమవారం డ్రా చేశాడు. స్కూటీ డిక్కీలో ఉంచి భీమడోలులో స్కూటీ షాపు ముందు ఉంచి సరుకుల కొనుగోలుకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి డిక్కీలో సొమ్ము ఎవరో కొట్టేశారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్లాస్టిక్ కవర్లను పరిశీలిస్తున్న అధికారులు

ప్లాస్టిక్ కవర్ల విక్రయం

వ్యాపారులకు రూ.22వేలు జరిమానా

భీమవరంటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల వాడకం నిషేధించారు. ప్రజారోగ్యశాఖ అధికారులు సోమవారం షాపులను ఆకస్మిక తనిఖీ చేసి ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను విక్రయిస్తున్న వ్యాపారులకు రూ.22వేల జరిమానా విధించారు. అసిస్టెంట్ కమిషనర్ ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలో శానిటేషన్ సెక్రటరీలు, ఇన్‌స్పెక్టర్లు షాపులు తనిఖీ చేయాలన్నారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలపై నిఘా ఉంచాలన్నారు. ప్రతీరోజు ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1 గంట, సాయంత్రం 5.30 నుంచి 7గంటల వరకూ బృందాలుగా వెళ్లి తనిఖీ చేయాలన్నారు. పెనాల్టీలు కట్టడానికి నిరాకరించిన దుకాణాలను సీజ్ చేయాలని స్పష్టం చేశారు. ప్రతీ రోజు విధించిన పెనాల్టీ వివరాలను తెలియజేయిలని ఆదేశించారు.

మార్చురీలో మృతదేహాల మాయంపై నేడు అధికారుల విచారణ

ఏలూరు క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మార్చురీలో అనాథ మృతదేహాల మాయం కావడంపై డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులు విచారణకు ఆదేశించారు. అక్టోబర్ 8న రాత్రి మార్చురీ అసిస్టెంట్ అశోక్ ఒక అనాథ మృత దేహాన్ని ఒక అంబులెన్సులో బయటకు తీసుకువెళ్లాడు. డ్యూటీలో ఉన్న మార్చురీ అసిస్టెంట్ గుర్తించి సంబంధిత హెచ్‌వోడీ భాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. దీనితో అశోక్ మృతదేహాన్ని వెనక్కు తీసుకువచ్చి అప్పగించాడు. అశోక్ గతంలో 8 మృతదేహాలను తరలించినట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీనిపై మెడికల్ కాలేజీ అప్పటి ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్ విచారణకు ఆదేశించారు. విచారణలో అనాథ మృతదేహాలు మాయం కావడాన్ని నిర్ధారించినట్లు సమాచారం. ఈ నివేదిక డీఎంఈ అధికారులకు చేరడంతో నేరుగా ఇద్దరు వైద్యుల బృందం మంగళవారం ప్రభుత్వ మెడికల్ కాలేజీకి విచారణ నిమిత్తం రానున్నారు. మార్చురీతో సంబంధం ఉన్న పలువురు ఉద్యోగులకు నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో మార్చురీ అసిస్టెంట్ అశోక్‌పై క్రిమినల్ కేసు నమోదైంది. అతడిని గతంలోనే సస్పెండ్ చేశారు.

మహిళ ఆత్మహత్య

ఏలూరు క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రామానికి చెందిన కలగర పూర్ణిమ (30) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెకు 13 ఏళ్ల క్రితం అనిల్‌కుమార్‌తో వివాహమైంది. ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఒక థియేటర్ వద్ద ఉన్న క్యాంటిన్‌లో పనిచేసే అనిల్‌కుమార్ అయ్యప్ప దీక్షలో ఉన్నాడు. పూర్ణిమ రెండు రోజుల నుంచి నెలసరి నొప్పితో బాధపడుతోంది. అనిల్‌కుమార్ కొద్ది రోజుల నుంచి పీఠం వద్దే ఉంటున్నాడు. పిల్లలతో ఇంటి వద్ద ఉన్న పూర్ణిమ సోమవారం వేకువజామున ఉరివేసుకుంది. సమాచారం అందడంతో రూరల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆమె నెలసరి నొప్పి బాధభరించలేక ఆత్మహత్య చేసుకుందా లేదా ఆమెకు ఒక స్నేహితుడు ఉన్నాడని, అతడు పట్టించుకోవడం లేదని ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని భావిస్తున్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

పురుగు మందు తాగి ఆత్మహత్య

ఏలూరు క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తి పురుగుమందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భీమడోలు మండలం పూళ్ళ గ్రామానికి చెందిన కాసాని రాంబాబు (45) ఐదేళ్ల నుంచి పెదవేగి మండలం బాపిరాజుగూడెంలో ఒక రైతు వద్ద పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం రైతు వద్దకు వెళ్ళి తాను మద్యం తాగాలని డబ్బులు అడిగాడు. తాను పాలు తీస్తున్నానని తరువాత ఇస్తానని రైతు చెప్పడంతో అకస్మాత్తుగా రాంబాబు పురుగు మందుతాగి పడిపోయాడు. అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందాడు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.


ఫిర్యాదులను స్వీకరిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి.. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

ప్రజా ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి

కలెక్టరేట్‌లో 177 ఫిర్యాదుల స్వీకరణ : జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

భీమవరంటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదులు పరిష్కారానికి మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పలు మండలాల నుంచి 177 ఫిర్యాదులు అందాయన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డివిజన్, మండల స్థాయిలో జరుగుతున్న కార్యక్రమాన్ని పరిశీలించి, ఎంత మంది అధికారులు వచ్చారు, ఏఏ శాఖల అధికారులు రాలేదని అడిగి తెలుసుకున్నారు. హాజరు కాని అధికారులపై అసహనం వ్యక్తం చేస్తూ, మూడు వారాలుగా హాజరు కాని అధికారులకు మెమోలు జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో కొన్ని ఫిర్యాదులు ఇలా.. 'నాకు పిల్లలు లేరు, నా భర్త కాలం చేశారు.. అనారోగ్యం వల్ల వైద్యచికిత్సలు కోసం అప్పులు చేశా. నా సోదరి కుమారులకు నేను రాసి ఇచ్చిన 97 సెంట్ల భూమి రిజిస్ట్రేషను రద్దు చేసి భూమి స్వాధీన పరచాలని గణపవరం గ్రామ నివాసి. వడ్లమూడి రామలక్ష్మమ్మ కోరింది. 'మా ప్రాంత ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరుగుచున్నాయి. విచారణ చేసి తగుచర్యలు తీసుకోవాలని పెనుగొండ గ్రామ నివాసి. పుత్తినీడి పద్మ కోరింది.

11 ఫిర్యాదులు అందాయి : ఎస్పీ

భీమవరం క్రైం : ప్రజా ఫిర్యాదుల అర్జీలు పునరావృతం కాకుండా నిర్ణీత గడువులోగా చట్ట పరిధిలో శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 11 ఫిర్యాదు అందాయని తెలిపారు. జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ వి.పుల్లారావు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మా పిల్లలకు మరుగుదొడ్డి కట్టించండి

నరసాపురం టౌన్ : వేములదీవి గొందిమూల గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో మరుగుదొడ్డి లేకపోవడం వల్ల మా చిన్న పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు, ప్రతి రోజు ఇంటికి వచ్చి అంగన్‌వాడీకి వెళ్లాల్సి వస్తుంది. సమస్యను గుర్తించి కేంద్రం వద్ద మరుగుదొడ్డి కట్టించాలని పిల్లల తల్లులు ఆర్డీవో దాసిరాజుకు వినతిపత్రం అందించారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవోను కలిసి అర్జీ అందజేశారు.

ధాన్యం కొనుగోళ్లలో దళారుల ప్రమేయం వద్దు

వీరవాసరం (భీమవరం టౌన్), నవంబరు 25(ఆంధ్రజ్యోతి) :ధాన్యం కొనుగోలులో దళారుల ప్రమేయం ఉపేక్షించేది లేదని, తూకాల్లో మోసం జరిగితే చర్యలు తప్పవని జేసీ రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం సాయంత్రం వీరవాసరంలో రైతు సేవా కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రైతు సేవ కేంద్రాల ద్వారా ఎంత ధాన్యాన్ని సేకరించారు.. రైతులకు 48 గంటల్లో డబ్బులు జమ అవుతున్నాయా వివరాలు అడిగి తెలుసుకున్నారు. మత్స్యపురి గ్రామంలో ఆరబెట్టిన ధాన్యాన్ని.. రైతులు పట్టుబడులు జరిగేచోట క్షేత్ర స్థాయిలోకి వెళ్లి పరిశీలించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, లేబర్ ఆఫీసర్ కేవీఆర్ శర్మ, సీఎస్ ఆర్.ఐ సురేష్ ఉన్నారు.

దీపం గ్యాస్ బండకు నిర్ణయించిన ధరే చెల్లించాలి : జేసీ

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన దీపం-2 పథకంలో అందిస్తున్న ఉచిత సిలెండర్‌కు వినియోగదారులు బిల్లులో ఉన్న 842 నుంచి 845 రూపాయలు మాత్రమే చెల్లించాలని జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి సూచించారు. అధిక ధరలు వసుళ్ళచేస్తున్నట్లుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఎవరైనా అధిక ధరను అడిగితే వెంటనే 1967కు కానీ, 1800 233 3555 నంబరుకు కాల్ చేసి ఫిర్యాలు చేయాలన్నారు.


వైసీపీ నాయకులకు పార్టీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే నాయకర్

జనసేనలోకి 250 మంది వైసీపీ నాయకులు

నరసాపురం టౌన్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు మండలంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. పార్టీకి ముఖ్య నాయకుడుగా వ్యవహరిస్తున్న సరిపల్లి సుబ్బరాజు పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఆయనతో పాటు మరో 250 మంది సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే నాయకర్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో జనసేన కండువాలు కప్పుకున్నారు. పార్టీలో చేరిన సుబ్బరాజు మాట్లాడుతూ పవన్ సిద్ధాంతాలు నచ్చి జనసేనలో చేరామన్నారు. కొపనాతి ప్రభాకర్‌రెడ్డి, నాగిడి భాస్కరరావు, బాలం వెంకటేశ్వర్లు, పృధ్వీరాజు, సత్యనారాయణరాజు, వర్మరాజు, నాగరాజు, నర్సింహమూర్తి, సాంబమూర్తి, చిన్న తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

ప్రజల పక్షాన ప్రభుత్వంపై పోరాటం చేద్దాం : ముదునూరి

అత్తిలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో వైసీపీని బలోపేతం చేసి, ప్రజల పక్షాన ప్రభుత్వంపై పోరాటం చేసేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నామని పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. సోమవారం అత్తిలిలో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అధ్యక్షతన ఆయన నివాసంలో ముఖ్య నాయకులతో నియోజకవర్గస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ రోజుల్లో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీని బలోపేతం చేసేందుకు గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి కమిటీలను నియమిస్తారన్నారు. త్వరలో పార్టీ అధినేత జిల్లాలో పర్యటించి నియోజకవర్గ నాయకులను కలిసి సమావేశాలు నిర్వహిస్తారన్నారు. మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్, మాజీ మంత్రి కొట్టు సత్యనారా యణ, పాలకొల్లు, ఉండి నియోజకవర్గాల ఇన్‌చార్జిలు గుడాల గోపీ, పీవీఎల్ నరసింహ రాజు మాట్లాడారు. ఏఎంసీ మాజీ చైర్మన్ బుద్దరాతి భరణిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ధర్నా

తణుకు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : విశాఖ లా విద్యార్థిని అత్యాచారం, తమిళనాడులో న్యాయవాది హత్యకు నిరసనగా విధులు బహిష్కరించామని తణుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ తెలిపారు. ఈ మేరకు ఆల్ ఇండియా లాయర్స్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ విశాఖలో న్యాయ విద్యార్థినిపై అత్యాచారం చేయడం దుర్మార్గమైన చర్య అని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని చెప్పారు. తమిళనాడులోని న్యాయవాదిని హత్య చేయడం దారుణమైన విషయమే అన్నారు. చట్టాలను తమ చేతుల్లోకి తీసుకోవడం చట్ట వ్యతిరేకమన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పద్మావతి, దుర్గాప్రసాదు, శ్రావణి, అనుకుల రమేష్, ముప్పిడి సుబ్బయ్య, కామన మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.


తణుకులో న్యాయవాదుల ఆందోళన

అదానీని అరెస్ట్ చేయాలి

మొగల్తూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సౌర విద్యుత్ కాంట్రాక్టుల కోసం గత ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలు లంచాలు ఇచ్చిన గౌతమ్ అదానీని అరెస్ట్ చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గాంధీబొమ్మల సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి వడుగు శ్రీనివాస్ మాట్లాడుతూ పదేళ్లుగా మోదీకి సన్నిహితుడుగా ఉంటూ సౌర విద్యుత్ కాంట్రాక్టు దక్కించుకోవాలనే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్న వ్యక్తులకు కోట్లాది రూపాయలు లంచాలు ఇచ్చారని ఆరోపించారు. ఈ విషయాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో యడ్ల చిట్టిబాబు, వీరా పాండురంగారావు, కొత్తపల్లి నాగరాజు, కొల్లాటి బాబూరావు, కొత్త విజయ్ కుమార్, పాల్గొన్నారు.




ప్రత్యేక అలంకరణలో ఆచంటేశ్వరుడు.. ఆచంటేశ్వరుని సన్నిధిలోని అఖండ జ్యోతిలో ఆవునెయ్యి వేస్తున్న ఆర్‌జేసీ దంపతులు.. దీపాలను వెలిగిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

శంభో.. శివ శంభో

మార్మోగిన శివనామస్మరణ

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

కార్తీక సోమవారం పూజలు

ఆచంట/పెనుమంత్ర, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం ఆఖరి సోమవారం మండలంలో ఉన్న శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆచంటేశ్వరుని సన్నిదిలో కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ సన్నిధిలో ఉన్న అఖండ జ్యోతిలో అనేక మంది భక్తులు ఆవునెయ్యి వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారి ఆదిమూలం వెంకటసత్యనారాయణ, గజేశ్వరరావు, సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దేవదాయ ధర్మాదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ కొమ్ముల సుబ్బారావు దంపతులు ఆచంటేశ్వరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెనుమంత్ర మండలం నత్త రామేశ్వరంలోని రామేశ్వరస్వామి, జుత్తిగలోని ఉమావాసుకి రవి సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- భీమవరంటౌన్ : మావుళ్ళమ్మ ఆలయంలో మాలధారులచే సోమవారం రాత్రి కార్తీక దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయం ఎదురుగా ఉన్న ప్రాంతంలో దీపోత్సవాన్ని నిర్వహించారు. పలు రకాల ఆకారాలకు దీపాలను ఉంచి వెలిగించారు. ఉత్సవ మూర్తికి పూజలు చేసిన అనంతరం మలధారులు దీపాలను వెలిగించారు. ఆలయ ఈవో బుద్ధా మహాలక్ష్మి నగేష్ పర్యవేక్షణలో నిర్వహించారు. శంకరమఠంలోని శారద అమ్మవారి దేవస్థానంలో కార్తీక కోటి దీపోత్సవాన్ని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు ప్రారంభించారు. తొలుత భోగిరెడ్డి సురేంద్రనాథ్, రమాదేవి దంపతులచే అర్చకులు పూజలు నిర్వహించారు. కార్తీక కోటి దీపోత్సవం, మహాలింగార్చన జ్యోతి లింగార్చన నిర్వహించారు.
- నరసాపురం టౌన్/మొగల్తూరు : నరసాపురం వశిష్ఠ గోదావరి తీరం శివనామస్మరణతో మార్మోగింది. మహిళలు గట్టుపై కార్తీక పూజలు చేసి దీపాలను గోదావరిలో విడిచిపెట్టారు. వలంధర్‌రేవు భక్తులతో కిటకిటలాడింది. మొగల్తూరులోని పురాతన పార్వతీ విశ్వేశ్వరస్వామి ఆలయం, వడయార్‌పేటలోని స్వయం భూలింగేశ్వర వనమల్లికార్జునుడు ఆలయం, పేరుపాలెం గ్రామాల్లోని శైవక్షేత్రాలు కిటకిటలాడాయి.
- పాలకల్లు అర్బన్/పాలకొల్లు టౌన్ : శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి నిత్యాన్న దాన కమిటీ ఆధ్వర్యంలో ఆలయం సమీపంలోని రేపాక వారి సత్రంలో సోమవారం తిల్లపూడికి చెందిన కామిశెట్టి రంగారావు, సీతామహాలక్ష్మీ, కుటుంబ సభ్యులు ఇచ్చిన విరాళం రూ.55వేలుతో తొమ్మిది వేల మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భక్తులు ఇచ్చిన విరాళాలు రూ. 85,437 అని కమిటీ సభ్యులు వెల్లడించారు. క్షీరా రామలింగేశ్వర స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో 16,500 మందికి బాదం పాలు సరఫరా చేశారు. ఓపెన్ ఎయిర్ థియేటర్ ఏరియాలో లక్ష్మీనారాయణ ఫ్రూట్ స్టాల్ ఆధ్వర్యంలో రెండు వేల మందికి, బాలి ఏడుకొండలు తల్లిదండ్రుల పేరుతో ఐదు వందల మందికి, అత్తిలికి చెందిన కూనపరెడ్డి జయరాజు, శంకరాపు రామకృష్ణ మిత్రులు ఆరువందల మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. టౌన్‌హాల్ ఆధ్వర్యంలో అల్పాహారం, కాపు క్లబ్ ఆధ్వర్యంలో పాలు భక్తులకు అందించారు. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదానం కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు యాత్రికులకు, భక్తులకు అన్నప్రసాదాలను వడ్డించారు.
- ఆకివీడు/ఉండి : ఆకివీడులో మల్లేశ్వరస్వామి, భీమేశ్వరస్వామి, వెంకటలింగేశ్వరస్వామి, మార్కండేయస్వామి, అగస్త్యేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలు అందించారు. ఉండి రాజులపేటలోని స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు.
- తణుకు : తణుకు బైపాస్ రోడ్డులోని శ్రీసాస్త పంచాయతన అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామికి పది క్వింటాళ్ళ బియ్యంతో అభిషేకం నిర్వహించారు. సోమవారం ఉదయం వేమూరి చలపతి స్వామి పూజా కార్యక్రమం నిర్వహించారు. సిరిశెట్టి శ్రీనివాసు సౌజన్యంతో అభిషేకం చేశామన్నారు. అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.
- పెంటపాడు : తెలుగు సంస్కృతి సంప్రదాయాల పట్ల విద్యార్థులు చిన్ననాటి నుంచే అవగాహన కలిగి ఉండాలని టీబీఆర్ సైనిక్ స్కూల్ చైర్మన్ తనుబుద్ధి భోగేశ్వరరావు అన్నారు. కార్తీక మాసం సందర్భంగా అలంపురం టీబీఆర్ సైనిక్ పాఠశాలలో సోమవారం ఘనంగా సరస్వతీ పూజలు నిర్వహించారు. ఆరు నుంచి పదో తరగతి వరకు ఎన్‌డీఏ శిక్షణ కోర్సు ప్రారంభించారు. కరస్పాండెంట్ పద్మావతి, ఎండీ రవికిరణ్, హెచ్‌ఎం కల్యాణి, ఏవో నాగరాజు పాల్గొన్నారు.


కాళ్ళకూరు వెంకన్న సన్నిధిలో సత్యనారాయణస్వామి వ్రతాలు

సత్యదేవుని వ్రతాలు

కాళ్ళ నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక బహుళ దశమి సోమవారం పురస్కరించుకుని భక్తులచే ఉచిత సామూహిక సత్యనారాయణస్వామి వ్రత మహోత్సవములు వైభవంగా నిర్వహించారు. ఏలూరు జిల్లా తాడినాడ వాస్తవ్యులు వేగేశ్న వెంకట సూర్య సత్యనారాయణరాజు దంపతులచే సుమారు 650 మంది దంపతులకు ప్రసాదము, స్వామివారి ప్రతిమలు అందించారు. దేవస్థానం వారు భక్తులకు ఉచితంగా పూజా సామగ్రి అందించారు. ఏర్పాట్లను ఈవో ఎం అరుణ్‌కుమార్, సిబ్బంది పర్యవేక్షించారు.

కార్తీక వనసమారాధనలు

తాడేపల్లిగూడెం రూరల్/పెంటపాడు/మొగల్తూరు : తాడేపల్లిగూడెం మండలం మెట్ట ఉప్పరగూడెంలో సోమవారం సగర సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన సాగింది. వనసమారాధనకు మాజీ సర్పంచ్ ఏపూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. పెంటపాడు మండలం రాచర్ల ఉమారామ లింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి స్వామిని దర్శించుకున్నారు. మొగల్తూరు కోట వద్ద జంపా వీరాస్వామి సుబ్బాయమ్మల తనయులు కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమారాధనలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మాజీ సర్పంచ్ కలిదిండి స్వర్ణ కుమార్ బాబు, కాపు సంఘ నాయకులు పాల్గొన్నారు. డిసెంబరు ఒకటిన నరసాపురం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే కాపు వన సమారాధనకు సంఘస్థులంతా హాజరు కావాలని కాపు సంఘ నాయకులు కోటిపల్లి సురేష్, కావలి నాని, పులపర్తి ప్రతాప్, తదితరులు కోరారు.


పాలకొల్లు క్షీరారామంలో అన్నప్రసాదాలను వడ్డిస్తున్న మంత్రి డాక్టర్ నిమ్మల


టీబీఆర్ స్కూల్లో సరస్వతి దేవికి పూజలు చేస్తున్న చైర్మన్ భోగేశ్వరరావు దంపతులు


రుద్రరాజు రామకృష్ణరాజును అభినందిస్తున్న నరసింహరాజు, గాదిరాజు బాబు

డీఎన్నార్ కాలేజీ అసోసియేషన్ సెక్రటరీగా రామకృష్ణరాజు

భీమవరం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : డీఎన్నార్ కళాశాల అసోసియేషన్ అసిస్టెంట్ సెక్రటరీగా రుద్రరాజు రామకృష్ణరాజును గవర్నింగ్ బాడీ సమావేశంలో ఎంపిక చేసినట్లు కళాశాల అధ్యక్షకార్యదర్శులు గోకరాజు వెంకట నరసింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో అసిస్టెంట్ సెక్రటరీగా సేవలందించిన కె.శివరామరాజు మరణించినందున వారికి నివాళులర్పించి వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఖాళీ అయిన అసిస్టెంట్ సెక్రటరీ పదవిలో రుద్రరాజు రామకృష్ణరాజును ఎంపిక చేశామన్నారు. రామకృష్ణరాజును పాలకవర్గ వైస్ ప్రెసిడెంట్ గోకరాజు పాండురంగరాజు, సీహెచ్ శ్రీనివాసరాజు, అసిస్టెంట్ సెక్రటరీ, కరస్పాండెంట్ కె రామకృష్ణరాజు, పాలకవర్గ ట్రెజరర్, పాలకవర్గ సభ్యులు అభినందించారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

ఆకివీడు రూరల్ నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దుంపగడప వీవీ గిరి కళాశాలలో ఎయిడ్స్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుత తరుణంలో ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎయిడ్స్ వంటి మహమ్మారులు మానవ సమాజానికి కలిగిస్తున్న సవాళ్లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య విధానంలో అనేక మార్పులు వచ్చాయని, దానికి తగ్గట్టుగా నడుచుకోవాలని అన్నారు. ప్రిన్సిపాల్ సుజాత, విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపుపై దాడి.. ఒకరి అరెస్ట్

ఆకివీడురూరల్/ఆకివీడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చినిమిల్లిపాడులో బలే వెంకటేశ్వరావు వద్ద నుంచి పది మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామని ఆకివీడు ఎక్సైజ్ ఎస్ఐ కరుణప్రియ తెలిపారు. ఏలూరు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఏఐఎస్ ఆదేశాల మేరకు చినిమిల్లిపాడులో దాడులు జరిపినట్లు తెలిపారు. బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్సైజు సీఐ శ్రీనివాసరావు, ఏఐఎస్ సిబ్బంది తదితరులున్నారు.

నేటి నుంచి మూడు రోజులు విద్యుత్‌కు అంతరాయం

నరసాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నరసాపురం 132 కేవీ లైన్‌లోని పాత తుప్పు పట్టిన టవర్లు భర్తీ చేసేందుకు మూడు రోజులు పాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నారు. నరసాపురం డివిజన్‌లోని మంగళవారం ఉదయం 9 గంటల నుంచి గురువారం సాయంత్రం వరకూ పలు చోట్ల అవసరం మేరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.మధు కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



తాడేపల్లిగూడెంలో మాట్లాడుతున్న వలవల.. ఉండిలో మాట్లాడుతున్న నాగరాజు

టీడీపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి : వలవల

తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం నియోజక వర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పట్టణ టీడీపీ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 55 వేల సభ్యత్వ నమోదుకు నియోజవర్గానికి లక్ష్యన్ని నిర్దేశిస్తే నెల రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు 18 వేలు మాత్రమే చేశామన్నారు. మంత్రి నారా లోకేశ్ నియోజకవర్గం సభ్యత్వంలో వెనుకబడి ఉందని సూచించారన్నారు. ప్రస్తుతం జిల్లాలో నాలుగో స్థానంలో నియోజకవర్గం ఉందన్నారు. పట్నాల రాంపండు, షేక్ బాజీ, పద్మనాభుని మురళి, సురగాల రాంబాబు, దాట్ల జగన్నాధరాజు తదితరులు పాల్గొన్నారు. ఉండి మండలం ఉండి టీడీపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ పార్టీ సభ్యత్వాల నమోదును వేగవంతం చేయాలన్నారు. గ్రామ అధ్యక్షుడు కాగిత బుజ్జి అధ్యక్షత వహించారు. మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు దాసరి వెంకట కృష్ణ, పేరిచర్ల బాలరాజు, కందుల బలరాం, యర్రా కేశవరావు పాల్గొన్నారు.

మహిళలపై హింసకు వ్యతిరేకంగా అవగాహన కల్పించాలి

భీమవరంటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహిళలపై జరిగే హింసకు వ్యతిరేకంగా విస్తృత అవగాహన కల్పించాలని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళలపై హింసా వ్యతిరేక దినోత్సవం వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 25 నుంచి వచ్చేనెల 10వ తేదీ వరకు 'మహిళలను స్వేచ్ఛగా బతకనిద్దాం, మహిళలను స్వేచ్ఛగా ఎదగనిద్దాం' అనే అంశంపై జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ ప్రవేటు సంస్థలు పాఠశాలలు, కళాశాలలలో విస్తృత ప్రచారం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పట్టణంలోని ఆర్ఆర్‌డీఎస్ డిగ్రీ కాలేజీలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహారావు ఆధ్వర్యంలో శ్రీవిజ్ఞానవేదిక, ఆర్ఆర్‌డీఎస్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళ హింసా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎంవీ రమణ, న్యాయవాది ఉండపల్లి రమేష్ నాయుడు, చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. మహిళల హింసలపై వ్యాసరచన వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

- గణపవరం : స్త్రీహింస నిరోధక దినోత్సవం సందర్భంగా మహిళలపై హింసా వ్యతిరేక దినోత్సవం సదర్భంగా గణపవరం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ కళాశాలలో పోస్టర్ల ఆవిష్కరణ, సోషల్‌మీడియా క్యాంపెయిన్‌లు నిర్వహించారు. మహిళలపై హింస నిర్మూలించడానికి విద్యార్థులు తయారు చేసిన వాల్ పోస్టర్సను వైస్ ప్రిన్సిపాల్ మధురాజు ఆవిష్కరించారు. అధ్యాపకులు అక్కిరాజు, వెంకటరమణ, శారదాదేవి, దుర్గారాణి పాల్గొన్నారు.
- నరసాపురం టౌన్ : పట్టణంలోని మిషన్ హైస్కూల్‌లో సోమవారం వనిత క్లబ్ ఆధ్వర్యంలో స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి మహిళల హక్కులు, సమానత్వం అంశాలపై అవగాహన కల్పించారు. ఉమామహేశ్వరి, స్వర్ణలత, భరణి, ఉషాకమల, రాజకుమారి, రమణ, మణికర్ణిక, హెచ్‌ఎం గీత పాల్గొన్నారు.


గణపవరంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు, విద్యార్థినులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : డీఎస్పీ

పాలకొల్లు అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాలంలో సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండడమే కాకుండా అప్రమత్తంగా ఉండాలని నరసాపురం డీఎస్పీ డాక్టర్ జి.శ్రీవేద అన్నారు. స్థానిక ఏఎస్ ఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజ రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన సోషల్ మీడియా, సైబర్ బెదిరింపులు వంటి వాటిపై అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ క్రైమ్స్ పట్ల అవగాహ కలిగి ఉండడంతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.కృష్ణ, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ కె.భద్రాచలం, సోషల్ మీడియా, సైబర్ క్రైమ్స్ కన్వీనర్ సీహెచ్ రవికుమార్ పాల్గొన్నారు.

శ్రీనివాస వర్మకు పరామర్శ

భీమవరంటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ తండ్రి సూర్యనారాయణరాజు మృతి చెందడంతో జనసేన పార్టీ రాష్ట్ర ప్రోటోకాల్ చైర్మన్ మల్లినీడి తిరుమలరావు విచ్చేసి వర్మను పరామర్శించారు. సూర్యనారాయణరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, వర్మ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. చల్లా రాము, కొప్పినీడి బాబి, పోకల కిషోర్, గుద్దటి త్రిమూర్తులు, యడ్లపల్లి రాంబాబు పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి శ్రీనివాసవర్మను కలసి పరామర్శించారు.

ములపర్రులో పారిశుధ్యం మెరుగుపరచాలి

పెనుగొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ములపర్రులో కొన్నేళ్లుగా తాగునీరు సరిగా అందించడం లేదని, పారిశుధ్యం నిర్వహణ లేనందున డెంగీ, వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయని సీపీఎం పెనుగొండ మండల కార్యదర్శి షేక్ పాదుషా అన్నారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ములపర్రులో పర్యటించారు. గ్రామంలో పారిశుధ్యం నిర్వహణ పూర్తిగా పంచాయతీ గాలికి వదిలేసిందన్నారు. పెదగరువులో కుళాయిల ద్వారా తాగునీరు రాదని, చెత్తను ఎవరికి వారే పోగు చేసి తగుల పెడుతూ ఉంటారని గూనపాటి జార్జ్ కుమార్ తెలిపారు. కేసరిపల్లి శాంత కుమారి, రొక్కాల సువర్ణ రత్నం, అంబటి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజలంతా మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కలిగి ఉంటే అంతా ఆరోగ్యంగా ఉండవచ్చని సర్పంచ్ కట్టా సత్యవతి జానకీరామ్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం మోదుగగుంట జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఎంఆర్‌సీ ఎం.రవికిరణ్, పాఠశాల సిబ్బంది, పాల్గొన్నారు.

క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు

తణుకు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తణుకు పౌర గ్రంథాలయం ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఎస్కేఎస్‌డీ మహిళా కళాశాల విద్యార్థినులు అల్లూరి సీతారామరాజుపై క్విజ్ పోటీల్లో బహుమతులు గెలుచుకున్నారు. బి.అమ్మాణి, ఝాన్సీ నాగభవాని ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ప్రిన్సిపాల్ లక్ష్మీసుందరీబాయి అభినందించారు.

వేసవిలో 1,150 ఉపాధి పనులు

నరసాపురం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే వేసవిలో మండలంలో 1,150 ఉపాధి పనులు చేపడుతున్నట్టు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఏ వై.శ్రీనివాస్ తెలిపారు. ఇప్పటికే 28 గ్రామాల్లో పనులకు సంబంధించి సభలు నిర్వహించి ప్రజల నుంచి పలు తీర్మానాలు తీసుకున్నామన్నారు. ప్రధానంగా చెరువుల పూడిక, మట్టి రోడ్ల నిర్మాణం, సీసీ రహదారులు, కచ్చా డ్రెయినేజీల వంటి పనులు ప్రాధానంగా ఉన్నాయన్నారు. ఈ పనులకు ప్రతిపాధనలు జిల్లా ఉన్నతాధికారులకు నివేదించామని, అనుమతి రాగానే వేసవిలో పనులు చేపడతామన్నారు.